




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 334 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శనివారం 12 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-


## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం : ప్రధాని మోదీ




- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు

»2

## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

- హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు



»2

- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన



## సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి : రాంచందర్‌రావు

- 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ
- సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్న రాంచందర్ రావు
- సెప్టెంబర్ 7న దీపాలు వెలిగించి మోదీకి శుభాకాంక్షలు తెలపాలని పిలుపు

»2

# విద్యే జీవితాన్ని మారుస్తుంది..

## అసెంబ్లీలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

- విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమన్న సీఎం
- ప్రత్యేక విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని వెల్లడి
- 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులున్నట్లు వెల్లడి
- ఏడాదిలో 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు ప్రకటన



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** విద్యే జీవితాలను మార్చే శక్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుకు దూరమైతే ఎంత ఆస్తి ఉన్నా సామాజికంగా వెనుకబడే పరిస్థితి ఉంటుందని చెప్పారు. 2024లో నిర్వహించిన సీపెక్ సర్వేలోనూ ఇదే విషయం వెల్లడైందన్నారు. అక్షరం ఒక్కటే మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తెలంగాణ విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చుతున్నామని అసెంబ్లీలో తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు కేశవరావు కమిటీని నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 28,163 ప్రభుత్వ విద్యా సంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. వీరికి 1.57 లక్షల మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారని చెప్పారు. జెన్ జీతో పాటు జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల భవిష్యత్తును తరగతి గదుల్లోనే తీర్చిదిద్దుతామని అన్నారు. ఉపాధ్యాయుల నియామకంలో తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో 7,857 మంది టీచర్లను మాత్రమే నియమించిందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని వెల్లడించారు. ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా 55 రోజుల్లో 10,600 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించామని తెలిపారు. రైట్ టు ఎడ్యుకేషన్ ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి, తెలంగాణలో 17 మందికే ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని వివరించారు. విద్యా రంగానికి గతంలో తగ్గుతూ వచ్చిన బడ్జెట్ కేటాయింపులను తమ ప్రభుత్వం పెంచుతోందని సీఎం చెప్పారు. అసెంబ్లీ సభ్యులు ఇచ్చిన సూచనలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు.

## బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ..

### - నలుగురు నిందితుల అరెస్ట్



**ఆగస్ట్ 31న బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో ఆయుధాల చోరీ**

**ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ ల సహకారం**

**28, 29 తేదీల్లో రెక్కీ నిర్వహించిన మల్లేశ్**

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు.
ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ ..

»2

## 22ఏ అనేది పొరపాటు కాదు..

### కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం: హరీశ్ రావు

- రేవంత్ రెడ్డి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారన్న హరీశ్
- మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- సామాన్యుల ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలన్న హరీశ్

»2



# రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే - కేటీఆర్



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు......

»2

- వీరప్పన్ మంత్రి అయితే ఎలా ఉంటుందో, రేవంత్ సీఎం కావడం అలాగే ఉందన్న కేటీఆర్
- సీఎం కాకముందు ఆర్టీఐతో బ్లాక్‌మెయిల్ చేసి బతికారని ఆరోపణ
- హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములపై సీఎం కన్ను పడిందన్న మాజీ మంత్రి
- భూదందాల వల్లే రేవంత్ రాజీనామా చేయాల్సి వస్తుందని జోస్యం
- రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్న కేటీఆర్

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

# అనలాగ్ పన్నీర్‌పై నిషేధం

- ప్రజారోగ్యం దృష్ట్యా సర్కార్ కీలక నిర్ణయం
- తయారీ, అమ్మకాలపై ఏడాది పాటు నిషేధం విధింపు
- సెప్టెంబర్ 10 నుంచి అమల్లోకి వచ్చిన ఉత్తర్వులు

»2



## కొండా సురేఖకు బుజ్జగింపులు...

### కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్



»2

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ..

### తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు



»2

# బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ..

## - నలుగురు నిందితుల అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి..** అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. అనలాగ్ పన్నీర్‌పై నిషేధం

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 'అనలాగ్' (కృత్రిమ) పన్నీర్‌పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిషేధం ఏడాది పాటు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్నీర్ పేరిట విక్రయిస్తున్న నాణ్యత లేని, కల్తీ ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ఈ కఠిన చర్యలు చేపట్టింది. పన్నీర్ పేరుతో చలామణి అవుతున్న డైరీయేతర, కృత్రిమ ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, రవాణా, పంపిణీ మరియు విక్రయాలపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ఆహార భద్రతా విభాగం (టీజీ సేఫ్) ఉత్తర్వులు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఈ ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వచ్చాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 30(2)(a) ప్రకారం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో రాష్ట్రంలో కల్తీ పన్నీర్ తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట పడనుంది.

# 22ఏ అనేది పొరపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం

## - హరీశ్ రావు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలో నిషేధిత భూముల జాబితా 22ఏ వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై కన్నేశారని హరీశ్ రావు ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలని ప్రచారం చేసుకున్నారని, కానీ నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసినా బాధితులకు ఎలాంటి పరిష్కారం దొరకడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం... బడా బాబులు నిర్మించిన అక్రమ నివాసాల జోలికి మాత్రం వెళ్లడం లేదని విమర్శించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 2ఏ నిషేధిత జాబితా నుంచి ముఖ్యమంత్రి నివాసాన్ని తొలగించినప్పుడు, అదే జాబితాలో ఉన్న సామాన్య ప్రజల నివాసాలను, భూములను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. తక్షణమే పేదల, సామాన్యుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెతెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం : ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి..** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

# ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

## - హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

**ప్రధాన మళ్లింపులు ఇవే:**

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉం టుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:**

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి : రాంచందర్‌రావు

**మొదటిపేజీ తరువాయి..** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధాన మంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచం దర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

# రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే : కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..**

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా మార్చలేరని, కానీ ఇప్పుడు భూభారతితో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని, ఈ వ్యవహారాలతో రేవంత్ రెడ్డి త్వరలోనే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కొండా సురేఖకు బుజ్జగింపులు... కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్

**మొదటిపేజీ తరువాయి..**

తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, సురేఖతో ఆమె నేరుగా సంభాషించినట్లు తెలియడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాలు, పార్టీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుగ్గా పాల్గొనాల



ని ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్.. కొండా సురేఖకు సూచించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి తప్పించిన తర్వాత జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఇన్‌ఛార్జ్ నేరుగా సురేఖతో మాట్లాడినట్లు సమాచారం. ఈ ఫోన్ కాల్ అనంతరం సురేఖ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

# దుగ్గిళ్ళ శ్రీధర్ బాబును శంషాబాద్ లో ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేయాలని వినతి:భవన నిర్మాణ కార్మిక సంఘం

- సిపిఐ పార్టీ శంషాబాద్ మండలం కార్యదర్శి నర్రా గిరి

**రాజేంద్ర నగర్,సెప్టెంబర్11, నేటి శుభోదయ :**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శంషాబాద్ జోన్ పరిధిలో అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఐదు రూపాయల భోజనం క్యాంటీన్ ని ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం,సిపిఐ పార్టీ శంషాబాద్ మండలం కార్యదర్శి నర్రా గిరి తెలంగాణ రాష్ట్ర మంత్రి దుగ్గిళ్ళ శ్రీధర్ బాబును మినిస్టర్ కోటర్స్ లో కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాల నుండి కార్మికులు జీవనో ఉపాధి కోసం శంషాబాద్ కు వలస కార్మికులు వేలాదిగా నివసిస్తున్నారు.లేబర్ అడ్డాల దగ్గర ఉపాధి లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వేలాది మంది కార్మికులు ఉన్నందున శంషాబాద్ లోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఐదు రూపాయల భోజనాన్ని (ఇందిరమ్మ క్యాంటీన్) ఏర్పాటు చేయాలని శ్రీధర్ బాబును కోరడం జరిగిందన్నారు.తప్పకుండా శంషాబాద్ లో ఐదు రూపాయల భోజనాన్ని ఏర్పాటు చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఏఐటియుసి



రాష్ట్ర ఉపాధ్యక్షులు వనంపల్లి జైపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయాలి

## దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి : మండల అధ్యక్షుడు మద్దూరి మానయ్య

**షాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :**
షాబాద్ మండలంలోని దెబ్బతిన్న గ్రామీణ రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట్ల బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి మానయ్య ఆధ్వర్యంలో శుక్రవారం షాబాద్ తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు.మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. వర్షాకాలంలో గుంతలు, బురద, నీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు.కక్కులూరు–అంతారం, రుద్రారం–దేవునిగడ్డ, నగర్‌గూడ–తిరుమలాపూర్, అస్పల్లిగూడ–చర్లగూడ, కాక్లూర్–రాసుమల్లగూడ, నందర్‌ఖాన్‌పేట్–దామర్లపల్లి, సోలిపేట–హైతాబాద్, షాబాద్–కొమరబండ, నగర్‌గూడ–తాళ్లపల్లి, పోతుగల్–మాచన్‌పల్లి తదితర రహదారులను అభివృద్ధి చేయాలని కోరారు. రోడ్లు లేని గ్రామాలకు కొత్తగా తారు, సీసీ, లింక్ రోడ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.కొమరబండ, బొబ్బిలిగామ గ్రామాల పరిధిలో వాగులు, కాలువల వద్ద అవసరమైన చోట్ల బ్రిడ్జిలు, కల్వర్టులు



నిర్మించాలని కోరారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో , BJYM రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు మహేందర్, షాబాద్ మండల వైస్ ప్రెసిడెంట్ జక్కని శేఖర్, సీనియర్ నాయకులు లంబడి రాము, దాదే హరీష్, శేఖర్, నారాయణ, లింగాల మహేందర్, విజయ్‌కుమార్, కృష్ణ కమ్మరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు నిరసన విజయవంతం : మాదిరెడ్డి మహిపాల్ రెడ్డి

**శంషాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :**
ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీజేపీ చేపట్టిన ఒక్కరోజు రైతు నిరసన కార్యక్రమం విజయవంతమైందని శంషాబాద్ మున్సిపల్ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాదిరెడ్డి మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై వివిధ రూపాల్లో ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతు సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ పిలుపుతో చేపట్టిన నిరసనలో పెద్ద సంఖ్యలో రైతులు, కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారని చెప్పారు. పాయల్ శంకర్ ట్రాక్టర్ నడుపుకుంటూ అసెంబ్లీకి చేరుకుని నిరసన తెలిపారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు రైతుబంధు, రుణమాఫీ, పంటల బీమా, కౌలు రైతులకు బీమా వంటి పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకుని మరింత పెద్ద ఎత్తున



ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు రాజిరెడ్డి, మహేందర్, రమేష్‌తో పాటు మొయినాబాద్ మండలానికి చెందిన జిల్లా నాయకులు మోర నర్సింహారెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తా చాటిన ఆశ్రమ విద్యార్థులు.

- క్రీడలకు ఎంపికైన విద్యార్థులు అభినందించిన ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు రవి, డిప్యూటీ వార్డెన్ డిఎస్ నాగేశ్వరరావు

**ఏన్కూర్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :**
మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఏన్కూరు మండల కేంద్రంలో నిర్వహించిన క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన 13 మంది విద్యార్థులను పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బి.రవి , డిప్యూటీ వార్డెన్ డిఎస్.నాగేశ్వరరావు అభినందించారు.ఈ సందర్భంగా నాగేశ్వర రావు మాట్లాడుతూ.. అండర్ – 14 వాలీబాల్ విభాగంలో విన్నర్స్ గా,అండర్ –17 వాలీబాల్ విభాగంలో రన్నర్స్ గా నిలిచారని తెలియజేశారు. అలాగే క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ,పట్టుదల, సమయపాలన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు.చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని,జిల్లా స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు,తల్లిదండ్రు



లకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులలో ఫిజికల్ డైరెక్టర్ బి.సక్రామ్ కృషి ఎంతైనా ఉందని వారిని అభినందించారు."క్రీడల్లో విజయం ఒక్కరోజులో రాదు.. నిరంతర సాధన, క్రమశిక్షణ,పట్టుదలతోనే విజయ శిఖరాలను అధిరోహించవచ్చు"అని విద్యార్థులకు సూచించారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,తోటి విద్యార్థులు అభినందిస్తూ,తదుపరి పోటీలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బి. సక్రామ్,ఉపాధ్యాయులు బి.శోభన్ నాయక్, బి.రవి,బి.సింగ్య ఎం.చంద్రరావు,పాయం శ్రీనివాస్,జే. నాగేశ్వరరావు, బి.శారద భాయి, డి.ఉషశ్రీ, హర్యానాయక్ మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల కులగణన చేపట్టాల్సిందే

- దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలను లెక్కల్లో విస్మరించడం అన్యాయం: ఇంద్రపార్క్ వద్ద ధర్మపోరాటం




**హైదరాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :**
దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు సమగ్ర న్యాయం జరగాలంటే బీసీల కులగణనను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్ ఇంద్రపార్క్ వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్మపోరాటం నిర్వహించారు. బీసీల జనాభా వాస్తవ సంఖ్యను అధికారికంగా లెక్కించకుండా వారి హక్కులు, వాటా, సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యంపై సరైన నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదని నాయకులు పేర్కొన్నారు.బీసీల కులగణన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు తగిన వాటా, హక్కులు కల్పించేందుకు కులగణన తప్పనిసరిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా ఎంత ఉందో శాస్త్రీయంగా తేల్చి, అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు, సంక్షేమ కార్యక్రమాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.ధర్మపోరాటంలో బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ హనుమంతరావు, మాజీ స్పీకర్ మధుసూదన్ చారి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కులగణనకు మద్దతు తెలిపారు.బీసీల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# ఆశా వర్కర్ మృతి.

- ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది దాతృత్వం



**ఏన్కూర్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏన్కూర్ మండల పరిధిలోని నాచారం ఆరోగ్య ఉప కేంద్రం లో గంగుల నాచారం గ్రామానికి చెందిన ఆశ వర్కర్ తాటి రమణ అనారోగ్య కారణాల వల్ల శుక్రవారం మృతి చెందింది.తాటి రమణ నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ కావడంతో ఏన్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ,ఆశ కార్యకర్తలు అందరూ కలిసి ఆర్థిక సహాయం గా 30 వేల రూపాయలు ఆమె కుటుంబానికి అంద చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గొంది వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం వరిస్తుంది



**ఏన్కూర్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :**
లక్ష్య సాధన కోసం నిరంతరం ప్రణాళిక బద్ధంగా చదివితే తప్పక విజయం వరిస్తుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, పాఠశాల పూర్వ విద్యార్థి తిరునగరి అనిల్ కుమార్ ఉపోద్ఘాటించారు. స్థానిక గురుకుల విద్యాలయంలో 10వ,తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు తన ఉపన్యాసంతో కొత్త ఉత్సాహాన్ని ప్రేరణను కలిగించారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలనే దానిపై, కెరీర్ గైడెన్స్ పై అవగాహన కలిగించారు. క్రమశిక్షణ,నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేమురాజు, ఏటీపీ శ్రీనివాస్, డిప్యూటీ వార్డెన్ రజిని, సీనియర్ ఉపాధ్యాయురాలు ఎం లక్ష్మి , ఉపాధ్యాయులు సునీల్, విశ్వేశ్వర రావు,చైతన్య, జమున రాణి, కుటుంబరావు, శివకుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు..

# అప్పుల్లో రైతులు.. వరుణుడి కటాక్షం కరువు

- రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి: కర్రెడ్ల నరేందర్‌రెడ్డి



**కేశంపేట, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** వర్షాలు సకాలంలో కురవక పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ సాంస్కృతిక శాఖ కో–కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతులకు వర్షాభావ పరిస్థితులు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.పంటలు ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను కేవలం సంక్షేమ పథకాలతో కాకుండా, సాగుకు అవసరమైన నీరు, విత్తనాలు, ఎరువులు, పంట బీమా వంటి అంశాల్లో సమగ్ర సహకారం అందించడం ద్వారా పరిష్కరించాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనను సమర్థవంతంగా అమలు చేసి ఉంటే ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు ఆర్థిక భరోసా లభించేదని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని, పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు.

# ముదిరాజ్ నాయకుల అక్రమ అరెస్టులపై తీవ్ర ఖండన



**డిండి( గుండ్ల ప ల్లి) , సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ముదిరాజ్‌లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ చైతన్య వేదిక–తెలంగాణ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమం నేపథ్యంలో ముదిరాజ్ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ముదిరాజ్ సంఘం–దిండి తీవ్రంగా ఖండించింది.డిండి పోలీసులు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గాజుల రామయ్యతో పాటు తవిటి సుధాకర్, పోలం లక్ష్మణ్, నూకం వెంకటేష్, నూకం చంద్రయ్య, మందుల సైదులు, నూకం శ్రీను, గుడి రాములు తదితరలను ముందస్తుగా అరెస్టు చేశారు.ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చాలని, ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్లు కేటాయించాలని, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. అరెస్టులు, నిర్బంధాలతో ముదిరాజ్ ఉద్యమాన్ని అణచలేరని, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

## కురవి మండలం సూధనపల్లి పాఠశాలలో ఉచిత యూనిఫామ్ పంపిణీ



**మహబూబాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** కురవి మండలం లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సూధనపల్లి లో ఉచిత యూనిఫాం పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మరియు స్కూల్ అసిస్టెంట్ (తెలుగు )అయిన శ్రీ చిన్నం ప్రదీప్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూదనపల్లి గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రతి సంవత్సరం రెండు జతల యూనిఫామ్స్ వస్తాయి... అలాగే ఈ సంవత్సరం కూడా మొదటి విడతగా ఉచిత యూనిఫామ్ లు సూధనపల్లి పాఠశాలకు రావడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎండి .అంజద్ పాషా, గాండ్ల బాలరాజు, బి. సరోజ, వి.శుభ, కె. సారంగం, ఏ .ప్రగతి,ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ రేఖ మాధవి, ఆయా నీలం వాసవి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎలమశెట్టి ధనమ్మ , అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# యోగా, ధ్యానంతో ఏకాగ్రత పెంపొందుతుంది

- విద్యార్థులకు యోగాసనాలు, ధ్యానంపై అవగాహన






**బోనకల్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యోగా, ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నళిని శ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఈశా ఫౌండేషన్ యోగా శిక్షకురాలు కొప్పుల పూజిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ యోగా ద్వారా వ్యక్తిగత పరివర్తనతో పాటు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు సాధ్యమవుతుందని తెలిపారు. యోగా, ధ్యానం ద్వారా భావోద్వేగాలను నియంత్రించుకోవచ్చని, కోపం, బాధ, సంతోషం వంటి భావాలను సమతుల్యం చేసుకోవడం ఎలాగో విద్యార్థులకు వివరించారు. శరీరం, మనసు, మెదడు మధ్య ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ, క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడతాయని తెలిపారు.విద్యార్థులతో వివిధ యోగాసనాలను వేయించిన పూజిత, ఆయా ఆసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా త్రికోణాసనం ద్వారా మెదడు పనితీరు మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ నళిని శ్రీ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డు, ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ యోగాను ఆచరించడం ద్వారా ఏకాగ్రత పెంపొందించుకుని చదువుపై దృష్టి సారించి మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఈశా ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అంతోటి తిరుపతిరావు, అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియకుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతిప్రియ, గ్రంథాలయ అధికారి మోహన్, యూడీసీ మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం: కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం ఇల్లందు క్రాస్‌రోడ్స్‌లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.అమరవీరుడు చలమల శ్రీనివాసరావు విగ్రహానికి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటవీ నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు సిబ్బందికి అవసరమైన శిక్షణ, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ సౌకర్యాలు కల్పించాలన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తారమైన అటవీ ప్రాంతం ఉందని, కోయలు, కొండరెడ్లు తదితర గిరిజన సమాజాలకు అడవులతో విడదీయరాని సంబంధం ఉందని తెలిపారు. అటవీ సంపదను పరిరక్షించడంతో పాటు గిరిజనుల హక్కులను కాపాడేందుకు అటవీ శాఖ, గిరిజన సమాజాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అటవీ సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అధ్యాపకుల సూచనలు పాటించండి ఉన్నతంగా ఎదగండి.

- కాలేజీ ప్రిన్సిపల్ విద్యార్థులకు సూచన
- నూతన విద్యార్థులకు ఘన స్వాగతం
- ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు





**ఏన్కూరు, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో శుక్రవారం నూతన విద్యార్థుల స్వాగత వేడుకలు (ఫ్రెషర్స్ డే) ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వందేమాతరం గీతాన్ని ఆలపించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రథమ సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ కార్యక్రమాన్ని కొనసాగించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం మాట్లాడుతూ.... ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ, సమయపాలన, మంచి నడవడి, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు. కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ, అధ్యాపకుల సూచనలను పాటించి, చదువులో ప్రతిభ కనబరచాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలకు ఈ దశ పునాది వంటిదని, ఇప్పటి నుంచే లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు.కార్యక్రమంలో అధ్యాపకులు నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కళాశాల నియమ నిబంధనలు, విద్యా ప్రాధాన్యత, వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. విద్యార్థులు పరస్పరం పరిచయాలు పెంచుకుని, స్నేహభావంతో మెలుగుతూ, కళాశాల ప్రతిష్ఠను నిలబెట్టేలా వ్యవహరించాలని సూచించారు.ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, వినోద కార్యక్రమాలతో సందడి చేశారు. నూతన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించగా, సీనియర్ విద్యార్థులు వారిని ప్రోత్సహించారు. దీంతో కళాశాల ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమం నూతన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు, కళాశాల పట్ల సానుకూల భావనను కలిగించింది. అధ్యాపకులు, సీనియర్ విద్యార్థులు అందించిన ఆత్మీయ స్వాగతంతో నూతన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం, అధ్యాపకులు, సీనియర్ విద్యార్థులు, ప్రథమ సంవత్సరం నూతన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో సాదా సీదాగ మండల సర్వసభ్య సమావేశం



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** సిరికొండ మండల ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంసర్పంచ్ ల సమక్షంలో అభివృద్ధి పనులపై చర్చగ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంస్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో రఫీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం కొలువుదీరింది. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, మరియు అన్ని శాఖల ప్రతినిధులు హాజరయ్యారు.సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రగతిని సమీక్షించి, కూలీలకు వేతనాలు సకాలంలో అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.మరియు ఇందిరమ్మ ఇండ్లు ఎన్ని సంక్షన్ అయ్యాయి ఎన్ని పూర్తి అయ్యాయి ఇంకా పూర్తి కానివి ఎన్ని అని సమీక్ష జరిగింది ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై అధికారులతో మాట్లాడారు.ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని, అన్ని శాఖల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశానికి సర్పంచ్ లు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడం కోసమేరుపు ప్రజాక్షేత్రంలో ప్రజల ఓట్లతోని గెలిచి ప్రజల సమస్యలపై మాట్లాడడానికి ఈ సమీక్ష మీటింగ్ కు రాకపోవడంలో అంతర్యం ఏమిటో ఎందుకు హాజరు కాలేరో ప్రజల సమస్య లు మాట్లాడే సమయం కూడా లేనంత బిజీ ఉన్నారా అని ప్రజలు అనుకుంటున్నారు ఈ కార్యక్రమంలో కొన్ని గ్రామాల సర్పంచ్ లు మరియు మండల స్థాయి ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారం విడుదల చేయాలి

- **కులాంతర వివాహ ప్రోత్సాహకాలు వెంటనే అందించాలి: కేవీపీఎస్**



**వికారాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** వైరా మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమీషనర్ మేడూరి రామచంద్ర రావు , కౌన్సిలర్ తిరుపతి శివ కుమారి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బి. వెంకట్రావు మెప్మా ఆర్.పి. దుర్గ వార్డు ప్రజలు మరియు మున్సిపాలిటీ సిబ్బందితో కలసి జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలందరూ భాగస్వాములు కావాలిఅని వైరా మున్సిపాలిటీ పరిధిలోని , భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిపౌరుడు తనవంతు బాధ్యతగా పాల్గొనవలసిందిగా కోరారు ఈసందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, స్వచ్ఛందసంస్థలు మరియు యువత అందరూ ఈకార్యక్రమంలో చురుకుగా పాల్గొని వర్షపు నీటిసంరక్షణ చర్యలను చేపట్టాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, నీటివృథాను నివారించాలని, భూగర్భజలాలనుపెంపొందించాలని, చెరువులు పరిరక్షించాలని, ప్రతిఇంటిలో వర్షపునీటిసంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలనివిజ్ఞప్తిచేయడమైనది.ప్రతి ఇంటివద్ద వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుటకు, భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించుటకు మరియు పర్యావరణ పరిరక్షణకు మనమందరం తోడ్పడవచ్చు.నీటిప్రతిబొట్టుఅమూల్యమైనది. భవిష్యత్తరాలకు నీటిభద్రతను కల్పించాలంటే ప్రతిపౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటిసంరక్షణలో భాగస్వామి కావాలి. ప్రజల సహకారంతోనేఈకార్యక్రమంవిజయవంతమవుతుందని, అందరూ స్వచ్ఛందంగా పాల్గొని "జల్ సంచయ్ జన్ భాగిధారి" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనివిజ్ఞప్తిచేయడమైనది. ఈప్రజాఉద్యమాన్నివిజయవతంచేయడానికి.వైరామున్సిపాలిటీతో కలిసి ప్రతిపౌరుడు స్వచ్ఛందంగాపాల్గొనినీటిసంరక్షణకు కట్టుబడి ముందుకు రావలసిందిగా పేర్కొన్నారు.నీటిని ఆదా చేద్దాం. భావితరాలకు భద్రతకల్పిద్దాం.

## ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**మొయినాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఎమొయినాబాద్ మండలం చందానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు ఆయనను ఘనంగా సన్మానించి, పదవీ విరమణ అనంతర జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి తనకు ఎంతో సంతృప్తి, సంతోషాన్ని అందించిందని తెలిపారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాలలో పనిచేసిన కాలంలో సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌తో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. STF రాష్ట్ర కార్యదర్శి పోచయ్య, STU రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, RUPP జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, SGTU రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గణేష్, చందానగర్ గ్రామ సర్పంచ్ మురళీకృష్ణ, STU మొయినాబాద్ మండల అధ్యక్షుడు బాలరాజు, STF మండల అధ్యక్షుడు సుధాకర్, UTF మండల అధ్యక్షుడు మల్లేష్, PRTTS మాజీ అధ్యక్షుడు బందయ్య, PRTU మండల ప్రధాన కార్యదర్శి వినోద్, UTF మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, STF మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, SGTU మండల ప్రధాన కార్యదర్శి లాలయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడుతూ పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మాట్లాడారు.

## అలీ సాగర్ అభివృద్ధికి చర్యలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లాలో గల ప్రముఖ పర్యాటక ప్రదేశము అలీ సాగర్ ను అభివృద్ధికి చర్యలు తీసుకొనున్నట్లు అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు.క్షేత్ర పర్యటనలో భాగంగా అలీ సాగర్ ను ఆకస్మికంగా సందర్శించి పార్కు,ఉద్యానవనము,బోటింగ్ పాయింట్,హరిత హోటల్ ను సందర్శించారు.హరిత హోటల్ లో పర్యాటకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అలాగే బోటింగ్ సిబ్బందికి పర్యాటకుల బోటింగ్ సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి వారికి వివరించారు.రాబోవు రోజులో అలీ సాగర్ ను అభివృద్ధి పరచడానికి కాంపౌండ్ వాల్,తీగల వంతెన,రాత్రి విడిది కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.ఆయన వెంట ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ సందీప్,జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి పవన్ కుమార్ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి 20 బ్లడ్ ప్రెషర్ పరికరాలు విరాళం



**నిజామాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** మనోరమా హాస్పిటల్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా.శిరిపల్లి శ్రీనివాస్ మానవతా దృక్పథంతో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కు 20 మాన్యువల్ బ్లడ్ ప్రెషర్ (బి పి) అపరాటస్ పరికరాలను విరాళంగా అందించి సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా నిజామాబాద్ జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.ఎల్.రాములు 20 బిపి పరికరాలను అందించిన డా.శిరిపల్లి శ్రీనివాస్ కి కృతజ్ఞతలు తెలియజేసి,శాలువాతో సత్కరించారు.ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను విరాళంగా అందించడం ద్వారా రోగుల వైద్య సేవలకు తోడ్పాటు అందించిన డా.శిరిపల్లి శ్రీనివాస్ సేవలను ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం అభినందించింది.

## భక్తి భావంతో ఉత్సవాలు నిర్వహించాలి

- **ధన్పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండపాలకు సహకారం....**
- **బారులు తీరిన నిర్వాహకులు....**



**నిజామాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఇందూరు వినాయక మండపాల నిర్వహకులు యువత ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.శ్రీ ధన్పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మార్వాడి గల్లి లో గల కార్యాలయంలో వినాయక ఉత్సవ నిర్వాహకులకు చెందాలను రాశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ఇందూరు యువత భక్తి మార్గంలో నడవాలని సూచించారు.వినాయక ఉత్సవాలను హిందూ సాంప్రదాయం ప్రకారం ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా శాంతియుతంగా నిర్వహించాలని తెలిపారు.ప్రతి సంవత్సరం తమ ట్రస్టు ద్వారా సహకారం అందిస్తామని గత సంవత్సరం 725 మండపాలకు అందించినట్లు పేర్కొన్నారు.భగవంతుడి ఆశీర్వాదంతో ఈ ఏడాది కూడా వచ్చిన వారందరికీ తన వంతు సహకారం ఉంటుందన్నారు.వినాయకుడు కేవలం ఒక పండుగకు సంబంధించిన దేవుడు కాదని సంస్కృతి సనాతన ధర్మం ఐక్యతకు ప్రతీక అని చెప్పారు.వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు తొలగి శుభాలు జరుగుతాయన్నారు.ఇంటింటా గణపతి పూజా చాలాకాలంగా ఉన్నప్పటికీ సామూహిక ఉత్సవాలకు బాలగంగాధర్ తిలక్ ప్రోత్సహించాడని గుర్తు చేశారు.దీనిద్వారా ప్రజలు ఒకచోట చేరి సామూహిక ఐక్యతను పెంపొందించుకొనే అవకాశం ఉంటుందన్నారు.శనివారం కూడా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు.

## ధర్పల్లిలో రైతుల విద్యుత్ సమస్యలపై బీజేపీ మీడియా సమావేశం




**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో పంట పొలాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు జీర్రా మహిపాల్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ అంతరాయాలు, పంటలకు సాగునీరు అందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను బీజేపీ నాయకులు వివరించారు.రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు పంట పొలాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ధర్పల్లి సబ్‌స్టేషన్‌లో ఏఈ రూప్ సాయికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్క గంగారెడ్డి, సరిచంద్, కర్రోల శ్రీకాంత్, సదానంద్ గౌడ్, నరేష్ గౌడ్, పాలెపు సుమన్, రఘుపతి రెడ్డి, అమ్రూ నాయక్, దోర్నాల రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, గోపి తదితరులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ అనుగోజు పూర్ణ కుటుంబాన్ని పరామర్శించిన మండల నాయకులు





**నేటి శుభోదయ :** సీనియర్ జనరలిస్ట్ అనుగోజు పూర్ణ తండ్రి అనుగోజు కోటయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి స్వగృహం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బైరవునిపల్లి గ్రామం వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శిన మండల అధ్యక్షులు బాలాగాని శ్రీనివాస్ గౌడ్,మాజీ జడ్పిటిసి,మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం గౌడ్,టెంపుల్ చైర్మన్ కోర్ని రవీందర్ రెడ్డి,జిల్లా ఎస్సి,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు గొల్లపల్లి రజినీ కాంత్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్,మాజీ ఒడిసిఎమ్ఎస్ చైర్మన్,జిల్లా కార్యదర్శి నూకల వేణుగోపాల్ రెడ్డి,మాజీ జడ్పిటీసి,జిల్లా కార్యదర్శి బాధవత్ రాము నాయక్, నేరడ గ్రామ పార్టీ అధ్యక్షులు మాదూరి రఘు తదితరులు పాల్గొన్నారు.

## దేవరయాంజాల్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్, బెల్ట్‌ల పంపిణీ

- **క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలి: జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి**



**శామీర్ పేట, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫామ్స్, బెల్ట్‌లను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్స్, బెల్ట్‌లను అందజేశారు.ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువులో రాణించాలని సూచించారు. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహతో గారిని కలిసి వినతి పత్రం అందజేసిన రాక్ టౌన్ కాలనీ అసోసియేషన్ సభ్యులు



**నాగోల్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** రాక్ టౌన్ అసోసియేషన్ తరుపున మన జోనల్ కమీషనర్ శ్రీ వికాస్ మహతో గారిని కలిసి కాలనీ కి సంబందించిన కొన్ని పెండింగ్ వర్క్స్ మరియు డెవలప్మెంట్ విషయాలు వారికీ వివరించి వాటిని వీలైనంత త్వరగా క్లియర్ చేపించాలని కోరడం జరిగింది. దానికి ZC సానుకూలంగా స్పందించి తప్పకుండా చేస్తానని తెలియజేయడం జరిగింది. ఈయొక్క కార్యక్రమంలో రాక్ టౌన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి, సెక్రటరీ జైపాల్ రెడ్డి, అడ్వైసర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

- **భావి పౌరుల నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం... చైర్మన్ వోడ్నాల శ్రీనివా**



**మంథని, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. మండల విద్యాధికారిణి దాసరి లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయ సిబ్బంది తదితర విభాగాలకు చెందిన 25 మంది ఉత్తమ సేవలందించిన వారికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, రెండో వార్డు కౌన్సిలర్ నూకల కమల్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొత్త శ్రీనివాస్, ఆర్‌టీఏ జిల్లా సభ్యుడు మంథని సురేష్, ఎంపీడీవో శ్రీజా రెడ్డి, ముత్తారం మండల విద్యాధికారి హరి ప్రసాద్, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్, ఈదులపల్లి నరసింహారావు, ఆర్. రమేష్ తదితరులు హాజరై పురస్కారాలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ భావి పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమాజ నిర్మాణంలో వారు పోషిస్తున్న పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఇస్తూ విద్యారంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు. ఎంపీడీవో శ్రీజా రెడ్డి మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోకి ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, ఉత్తమ సేవలందించిన గురువులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు, పురస్కారాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు పండ్ల మొక్కలతో అభినందన

- **పర్యావరణ ప్రేమికుడు పేర్ల గణేష్ ముదిరాజ్ ప్రత్యేక శుభాకాంక్షలు**



**మహబూబాబాద్ , సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం కురవి మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ ఎంఈఓ బాలాజీ ఆహ్వానం మేరకు పర్యావరణ ప్రేమికుడు పేర్ల గణేష్ ముదిరాజ్ హాజరై అవార్డులు అందుకున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు పండ్ల మొక్కలను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పేర్ల గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వర్షపాతం తగ్గుదలకు అడవులు, చెట్లు తగ్గిపోవడం కూడా ఒక ప్రధాన కారణమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించే కార్యక్రమంలో పండ్ల మొక్కలను బహుకరించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటిన పేర్ల గణేష్ ముదిరాజ్‌ను ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ మంచి కార్యక్రమంలో తనను భాగస్వామిని చేసిన ఎంఈఓ బాలాజీకి పేర్ల గణేష్ ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మాపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం

- **మంథని మార్కెట్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి**
- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి**



**మంథని, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** మంథని మున్సిపల్ మార్కెట్ నిర్మాణ పనుల్లో జాప్యానికి తమ కుటుంబమే కారణమంటూ కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి మండిపడ్డారు. మార్కెట్ నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులు, ప్రజలకు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంథని అభివృద్ధిని కోరుకునే రాజకీయ పార్టీల్లో బీజేపీ ముందుంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలు, మంథని మున్సిపాలిటీకి వస్తున్న నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు తమ పార్టీ ఎప్పుడూ మద్దతుగా ఉంటుందని తెలిపారు.మంథని మార్కెట్ అభివృద్ధికి తమ కుటుంబం ఎప్పటి నుంచో సహకరిస్తోందని, చందుపట్ల రామ్‌రెడ్డి హయాంలోనే మార్కెట్‌కు పునాదులు పడ్డాయని గుర్తుచేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలతో మార్కెట్ నిర్మించాలని మున్సిపల్ అధికారులకు, ప్రభుత్వానికి బీజేపీ తరఫున నిరంతరం సూచనలు చేస్తున్నామని తెలిపారు.మంథని అభివృద్ధి చెందకూడదనే ఉద్దేశంతో అసూయ, ద్వేషాలతో కొందరు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై కాకుండా వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాలతో రాజకీయాలు చేయడం దిగజారుడు చర్య అని అన్నారు. రాజకీయాల్లో వ్యక్తిత్వమే ముఖ్యమని పేర్కొన్నారు.ప్రజాసేవలో తమ కుటుంబానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, గత 15 ఏళ్లుగా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నామని సునీల్‌రెడ్డి తెలిపారు. ప్రజల కోసం తమ కుటుంబం స్వంత భూములను ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్, మాజీ పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి వొజ్జల మురళీకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, ఎడ్ల సాగర్, ఉపాధ్యక్షులు బొల్లంపల్లి లక్ష్మణ్, ఆ ఇంటి మల్లేష్, కార్యదర్శి పార్వతి విష్ణు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గుడ్లగురవేష్, మండల ఉపాధ్యక్షుడు ఎల్లవేణి సమ్మయ్య, నాయకులు చందు, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## షాట్ సర్క్యూట్ లో గాయపడిన రొడ్డ బిచ్చన్నను పరామర్శించిన

- **బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోవింద్ శ్రీధర్ రెడ్డి**




**వనపర్తి , సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** చిన్నంబావి మండల పరిధిలోని గూడెం గ్రామంలో గత మూడు రోజుల క్రితం షాట్ సర్కిట్ లో ప్రమాదంలో ఇల్లు దగ్ధమై ఈ ప్రమాదంలో గాయపడిన రొడ్డ బిచ్చన్న వనపర్తి జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్న విషయము తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మండలాల ఇన్చార్జి గోవింద శ్రీధర్ రెడ్డి హాస్పిటల్ దగ్గరకు వెళ్లి రోడ్డ బిచ్చన్నను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి మరియు ప్రమాదం జరిగిన సంఘటన వివరాలను, ప్రమాదంలో నష్టపోయిన ఇల్లు వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. రోడ బిచ్చన్న కు మనోధైర్యం కల్పిస్తూ ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. రోడ్ద బిచ్చన్న త్వరగా కోలుకొని ప్రజల్లోకి రావాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని అన్నారు. రోడ బిచ్చన్న ఆరోగ్య బాగోగుల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే డాక్టర్లను రోడ బిచ్చన్న కి మెరుగైన వైద్యం అందించాలని బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మండలాల ఇన్చార్జ్ గోవింద శ్రీధర్ రెడ్డి డాక్టర్లను ఈ సందర్భంగా కోరారు.

# విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

- ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది: తహసీల్దార్ విజయ
- ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది: తహసీల్దార్ విజయ





**మహబూబాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** కురవి మండల పీఆర్టీయూటీఎస్ శాఖ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ కురవి పాఠశాల ప్రాంగణంలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురవి మండలంలో విధులు నిర్వహిస్తున్న 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి కురవి మండల శాఖ అధ్యక్షులు వెంపటి సీతారాములు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కురవి మండల తహసీల్దార్ విజయ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధన చేయడమే కాకుండా వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు మిరియాల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 6 డీఏలను వెంటనే విడుదల చేయడంతో పాటు పీఆర్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చాగట్లపూడి శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి ఆకుతోట శివ ప్రసాద్, మాజీ అధ్యక్షులు తుడి వెంకటేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, శ్యామలదేవి, దామోదర్, మధు సూదనాచారి, జిల్లా బాధ్యులు దాసరి శేఖర్, దేవేందర్, సునీత తదితరులతో పాటు మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పినపాక డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్

- సాధారణ రైతు కుటుంబం నుంచి ఉన్నత శిఖరాలకు



**పినపాక, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** పినపాక డిప్యూటీ తహసీల్దార్ రమేష్ విద్యారంగంలో అరుదైన ఘనత సాధించారు. 'ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన భూముల పరాయీకరణ – భద్రాచలం ఐటిడీఏపై ఒక అధ్యయనం' అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజకీయ శాస్త్ర విభాగంలో చేసిన లోతైన పరిశోధనకు గానూ ఆయనకు డాక్టరేట్ లభించింది. సీనియర్ ఆచార్యులు జాడి ముసలయ్య మార్గదర్శకత్వంలో ఈ పరిశోధన సాగింది.సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన రమేష్, చిన్నతనంలోనే తండ్రి ధర్మయ్యను కోల్పోయారు. తల్లి మంగమ్మ కష్టపడి చదివించగా, తాత సహకారం కూడా లభించింది. పాఠశాల విద్యను ఐటిడీఏ పాఠశాలలో, ఇంటర్‌ను ఏపీఆర్‌జేసీ కృష్ణసాగర్, బూర్గంపాడులలో, డిగ్రీని భద్రాచలంలో పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పిజి పూర్తి చేసి, 2018లో ఉస్మానియాలో పిహెచ్‌డీ ప్రవేశం పొందారు.రమేష్ సోదరులు, చెల్లెలు కూడా ఉన్నత చదువులు పూర్తి చేసి ఆచార్యుడిగా, సర్వేయర్‌గా, ఉపాధ్యాయురాలిగా స్థిరపడ్డారు. పేదరికం, కష్టాలను జయించి ఐటిడీఏ బడి నుంచి డాక్టరేట్ స్థాయికి ఎదిగిన రమేష్ విద్యా ప్రస్థానం పినపాక ప్రాంత ప్రజలకు, యంత్రాంగానికీ గర్వ కారణంగా నిలిచింది.

# కల్వచర్లలో కోతుల బెడద

- 9, 10వ వార్డుల్లో భయాందోళనలు.. సర్పంచ్‌కు మహిళల వినతి



**మంథని/రామగిరి, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని 9, 10వ వార్డుల్లో కోతుల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఆయా వార్డుల మహిళలు సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు.గత కొన్ని నెలలుగా ఉదయం, మధ్యాహ్నం వేళల్లో కోతులు గుంపులుగా ఇళ్లలోకి, వంట గదుల్లోకి చొరబడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు, మహిళలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే అటవీశాఖ అధికారులతో మాట్లాడి కోతులను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అధికారులు స్పందించకపోతే వార్డు ప్రజలతో కలిసి నిరసన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో 9, 10వ వార్డు సభ్యులు రేండ్ల కుమారస్వామి, చిందం కవితతో పాటు మహిళలు కె. రమాదేవి, సిహెచ్. రమాదేవి, సిహెచ్. శిరీష, ఎన్. రాజేశ్వరి, డి. సాత్విక, బి. సమత, సిహెచ్. రాణి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై రాజీలేని పోరాటమే సీపీఎం లక్ష్యం

- నవంబర్ 15న నల్గొండలో కిసాన్ మహాసభల బహిరంగ సభకు రైతులు తరలిరావాలి
- బోనకల్‌లో సీపీఎం మధిర డివిజన్ విస్తృతస్థాయి సమావేశం





**బోనకల్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు నిర్వహిస్తూ, రైతుల ఆర్థిక అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతామని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. బోనకల్ మండల కేంద్రంలోని వి.వి.ఆర్. ఫంక్షన్ హాల్‌లో దొండపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మధిర డివిజన్ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.నవంబర్ 15న నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఆలిండియా కిసాన్ జాతీయ మహాసభల సందర్భంగా జరిగే బహిరంగ సభకు మధిర డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామం నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత మూడు సంవత్సరాల కాలంలో రైతు సమస్యలపై నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలను మహాసభల్లో సమీక్షించనున్నట్లు తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో రైతుల సమస్యల పరిష్కారంతో పాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

**వీర తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు**

కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేదల భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటమని సమావేశంలో నాయకులు గుర్తుచేశారు. 1948 నుంచి 1952 వరకు సాగిన ఆ పోరాటంలో జమీందారులు, పటేల్, పట్వారీ వ్యవస్థల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పేద ప్రజలను సంఘటితం చేసి పోరాడారని తెలిపారు. ఆ పోరాట ఫలితంగా లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందని పేర్కొన్నారు. నాటి పోరాట స్ఫూర్తితోనే నేటి రైతాంగ సమస్యలపై కూడా నిరంతర ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 12న సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించనున్న సెమినార్‌కు పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్ రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.పార్టీ సీనియర్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాస్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం మధిర డివిజన్ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య, రైతు సంఘం మధిర డివిజన్ అధ్యక్షులు దివ్వెల వీరయ్య, మహిళా సంఘం మధిర డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు జొన్నలగడ్డ సునీత, పయ్యావుల ప్రభావతి, నవతెలంగాణ ఖమ్మం జిల్లా మేనేజర్ ఎస్.డి. జావీదు, జిల్లా సర్క్యులేషన్ ఇన్‌చార్జి ఇరుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.అలాగే ముదిగొండ, చింతకాని, బోనకల్, మధిర అర్బన్, మధిర రూరల్, ఎర్రుపాలెం మండలాల సీపీఎం కార్యదర్శులు బట్టు పురుషోత్తం, ఉపేందర్, కిలారు సురేష్, పడకంటి మురళి, మంద సైదులు, మద్దాల ప్రభాకర్‌తో పాటు డివిజన్, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ 25 ఏళ్ల పాలన దేశానికి శ్రీరామరక్ష

- శ్రీశైలం దేవస్థానం బోర్డ్ మెంబర్ కట్టా సుధాకర్ రెడ్డి, జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి




**తలకొండపల్లి, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** భారత ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్ల పరిపాలన కాలం పూర్తి చేసుకున్నందునా అలాగే మోడీ పుట్టినరోజు సందర్భంగా దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ తలపెట్టిన" సేవా సంకల్ప అభియాన్ "అనే కార్యక్రమం చేపట్టింది అందులో భాగంగా ఆ కార్యక్రమాల యొక్క దిశా నిర్దేశం చేసేందుకు కల్వకుర్తి పట్టణంలోని భాజపా కార్యాలయంలో నిర్వహించిన సేవా సంకల్ప అభియాన్ మున్సిపాలిటీ &మండల కార్యశాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీశైలం దేవస్థానం బోర్డు మెంబర్ కట్టా సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూభారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా 9 కార్యక్రమాలు చేపట్టడం జరిగింది ఈ తొమ్మిది కార్యక్రమాలను నరేంద్ర మోడీ పుట్టినరోజు సెప్టెంబర్ 17 నుండి మొదలుకొని అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా ఘనంగా 9 కార్యక్రమాలు నిర్వహించాలని ప్రతి బూతులో ఈ కార్యక్రమాలు నిర్వహించి నరేంద్ర మోడీ గారికి పుట్టినరోజు కానుకగా ఇవ్వాలని దిశా నిర్దేశం చేశారు...కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జాతీయ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం నరేంద్ర మోడీ మనందరిలో ఒక స్వయంసేవకుడిలా సామాన్య వ్యక్తిగా జీవిస్తూ ఉన్న వ్యక్తి శుక్రవారం ప్రపంచ నాయకుడు అయ్యాడంటే అది ఆయన హిందూ ధర్మానికి కట్టుబడి ఉండడం వల్లనే సాధ్యమైందని తెలియజేశారు ఈ దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తో పోటీపడే నాయకుడు పుట్టలేదని పుట్టబోడని స్పష్టం చేశారు భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దే వరకు అలుపెరగకుండా నరేంద్ర మోడీ పని చేస్తూనే ఉంటారని వారిని ఆదర్శంగా తీసుకొని మనమంతా ముందుకు సాగాలని భారతదేశం విశ్వ గురువు అయ్యేంతవరకు విశ్రమించొద్దని కార్యకర్తలకు పిలుపునిచ్చారు...ఈసందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మోర్చా అధ్యక్షులకు పదాధికారులకు శాలువాతో సన్మానం చేశారు...ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ& రూరల్ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్, మట్ట నరేష్ గౌడ్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండోజు గంగాధర్, జిల్లా సేవా సంకల్పయాన్ కో కన్వీనర్ బోడా నరసింహ,మున్సిపాలిటీ&రూరల్ కన్వీనర్లు నరేడ్ల శేఖర్ రెడ్డి,సూర్యకృష్ణ గౌడ్, జిల్లా కార్యదర్శి గుర్రాల రాంభూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బండెల రామచంద్రారెడ్డి,అంజన్ రెడ్డి,కురుమిద్ద సర్పంచ్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఎనుగొండ రామకృష్ణ, వరికుప్పల శ్రీరాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ వాగుల్దాస్ నరేష్ గౌడ్,మండల ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి బాలకృష్ణ,ప్రధాన కార్య దర్శులు దేవర్ల మహేష్,పెద్దొరి పర్వతాలు,బచ్చలకూర శ్రీశైలం,ఎస్టి మోర్చా అధ్యక్షులు వంశీ నాయక్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కృష్ణయ్య, బొడ్డుపల్లి శ్రీకర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు పరశురాములు,యువ మోర్చా అధ్యక్షులు తోడేటి అరవింద్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షులు కిరణ్ రెడ్డి,మోతే హుస్సేన్,కోశాధికారి లక్ష్మీనరసింహ,నాయకులు బాలరాజు గౌడ్ ,మాయని రాజశేఖర్ ఆనంద్,వెంకటేష్ ,చింటూ,రంగయ్య, భూత్ అధ్యక్షులు వివిధ పదాధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మృతుడి కుటుంబానికి ఉప్పల ట్రస్ట్ ఆర్థిక సాయం అందజేత

- **సర్పంచుల సంఘం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య**



**లకొండపల్లి, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన నూకం నరసింహ ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ ప్రెసిడెంట్ ఉప్పల వెంకటేష్ ఆదేశాల మేరకు స్థానిక నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, నూకం నరసింహ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, నిరుపేదలకు తనవంతు సహాయం అందించడం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.నూకం నరసింహ కుటుంబానికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో రూ.3 వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు చెప్పారు. భవిష్యత్‌లోనూ అవసరమైన సందర్భాల్లో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.మృతుడి కుటుంబానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నూకం నరసింహ సేవలను, ఆయనతో ఉన్న అనుబంధాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్, కనుక వెంకటయ్య, తుమ్మ నరసింహ, దశరథ, రవికుమార్, పద్మ, శ్రీశైలం, కుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపైనా కేసులుసి : ఐ రఘుకుమార్




**వికారాబాద్, సెప్టెంబర్11, నేటి శుభోదయ** వికారాబాద్: మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేసేందుకు వికారాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్‌సైకిళ్లు నడుపుతున్న 15 మంది మైనర్లపై కేసులు నమోదు చేసినట్లు వికారాబాద్ సీఐ రఘు కుమార్ తెలిపారు.మైనర్ల తల్లిదండ్రుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, అనంతరం కేసులను న్యాయస్థానానికి పంపనున్నట్లు చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని సీఐ హెచ్చరించారు.చిన్నారుల భద్రతతో పాటు రహదారి ప్రమాదాలను నివారించేందుకు తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, 18 ఏళ్లలోపు పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ మోటార్‌సైకిళ్లు, ఇతర వాహనాలు ఇవ్వవద్దని రఘు కుమార్ విజ్ఞప్తి చేశారు.

# రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ధర్నా విజయవంతం





**నిజామాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు.రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి మాట్లాడుతూ....తనిఖీల పేరుతో నిజాయతీగా పనిచేస్తున్న రైస్ మిల్లర్లను వేధించవద్దని,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద రైస్ మిల్లుల యజమానులు మహా ధర్నా చేపట్టారు.అధికారులు దాడులు,రికార్డుల పేరుతో వేధింపులు మితిమీరాయని ఆవేదన వ్యక్తం చేశారు.తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించే వరకు మిల్లుల బంద్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ ధర్నాలో నిజామాబాద్ జిల్లా రైస్ మిల్స్ యజమానులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ కోసం సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్

- **రాబోయే పండగల నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు**
- **డ్రగ్స్,సైబర్ నేరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు**
- **రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి ప్రజలలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలి**
- **పాత నేరస్థులపై నిఘా పటిష్టము చేయాలి**
- **చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై నిర్విరమంగా దాడులు నిర్వహణ,అవసరం అయితే పి.డి యాక్ట్ నమోదు**
- **డయల్ 112 గురించి ముమ్మరంగా ప్రచారం చేయాలి**



**నిజామాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్ డివిజన్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి పై నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సమగ్ర సమీక్ష సమావేశం భీంగల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించగా ఆర్మూర్ డివిజన్ ఏ.సీ.పీ,సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు,ఎస్.హెచ్.ఓ లు,ఎస్సైలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ....రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు డ్రగ్స్,గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని,అక్రమ రవాణాలో పాలొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు.సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు,రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్మూర్ డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ముఖ్యంగా హత్య,హత్యాయత్నం,చోరీలు,మహిళలపై నేరాలు,సైబర్ మోసాలు,డ్రగ్స్,గంజాయి అక్రమ రవాణా,పేకాట,గుట్కా అక్రమ వ్యాపారం వంటి కేసులపై ప్రత్యేకంగా చర్చించారు.పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని,రౌడీషీటర్లు,పాత నేరస్తులు,బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి,అనుమానాస్పద వ్యక్తులు,వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు.మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,షీ టీమ్స్,ఈగల్ టీమ్స్,చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు.విద్యాసంస్థలు,బస్టాండ్లు,రైల్వే స్టేషన్లు,జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు.అలాగే పేకాట,గుట్కా,ఇసుక,ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని,ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.రిసెప్షన్ నిర్వహణ,రికార్డుల నిర్వహణ,స్టేషన్ పరిశుభ్రత,సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి,నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు.చివరిగా శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని,ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి,సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.హైవే రోడ్డులను కలుపుతూ ఉండేటటువంటి లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం,రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధముగా చూడాలని అన్నారు.రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే,స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్,త్రిబుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.డయల్ 112 గురించి ప్రజల వద్దకు చేరే విధంగా అనుక్షణం కృషి చేయాలి.రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని,వాహనాల తనిఖీలు 24/7 తనిఖీలు చేయాలని,వాహనాల తనిఖీలు సమయంలో సిబ్బంది అలసత్వం పనికిరాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏ.సి.పి జె.వెంకటేశ్వర్ రెడ్డి,సి.సి.ఆర్.బి ఎ.సి.పి గురునాయుడు,సి.సి.ఆర్బి ఇన్స్పెక్టర్ ఆర్.అంజయ్య,సీ.ఐ లు,ఎస్.హెచ్.ఓ లు,ఎస్.ఐ లు,ఐటి కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# కొత్తపేట చౌరస్తా భవాని మందిరం ముందు ఆర్యవైశ్య అన్నదాన కార్యక్రమం

- **అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కొత్తపేట డివిజన్ బిజెపి అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్**



**కొత్తపేట; సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** కొత్తపేట చౌరస్తా భవాని మందిర్ ముందు అమావాస్య సందర్భంగా నిర్వహించిన కొత్తపెట్ డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ బిజెపి అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది. భవాని మందిర్ ఆలయ చైర్మన్ రిషి,పాల్గొనడం జరిగింది. అలాగే నూతన ఆర్యవైశ్య అధ్యక్షునిగా ఎన్నికైన సిహెచ్.కరుణాకర్ గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి యొక్క కమిటీ సభ్యులు రాజన్న, ప్రధాన కార్యదర్శి గొల్ల రమేష్ ఉపాధ్యక్షులు డి.వీర లింగం ఆంజనేయులు చంద్రకాంత్ ఫౌండర్ అత్యం సత్తయ్య, మాణిక్యం, కోశాధికారి సోమ అనంత రాములు, జాయింట్ సెక్రెటరీ వెంకటేష్ గార్లకు అందరి కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.అలాగే ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సందీప్, రాజుగారు కార్యకర్తలు భక్తులు పాల్గొనడం జరిగింది.మంచి రాజేష్ కుమార్.(బిజెపి కొత్తపేట్ డివిజన్ అధ్యక్షులు)

# ఆరు నెలలుగా జీతాలు లేక కార్మికుల అవస్థలు

- **పండుగ పూట కూడా పస్తులే ఉండాలా**
- **జీతాలు చెల్లించకుంటే మార్కెట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా: బీజేపీ**



**గజ్వేల్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** గజ్వేల్ సమీకృత కూరగాయల మార్కెట్‌లో ప్రతిరోజూ మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుతూ విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రమను గుర్తించి, వారికి రావాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలని మార్కెట్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజుల్లోగా కార్మికుల బకాయి జీతాలను చెల్లించకపోతే, కార్మికులతో కలిసి మార్కెట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని మార్కెట్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్మికుల సమస్యను ప్రభుత్వం, మార్కెట్ అధికారులు తక్షణమే పరిష్కరించి, బకాయి జీతాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమీకృత మార్కెట్‌లో పనిచేస్తున్న కార్మికులతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు ఐల మహేందర్, బీజేవైఎం నాయకులు గడియారం రాజేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## శ్రీ ఆర్యవైశ్య వాసవి మాత సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అమావాస్య అన్నదాన కార్యక్రమం

**కొత్తపేట సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** న్యూ నాగోల్, కొత్తపేటలోని శ్రీ ఆర్యవైశ్య వాసవి మాత సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశిష్ట గోల్డ్ , డైమండ్స్ అధినేత శ్రీ పలుబట్ల ఆనంద్ బాబు పాల్గొన్నారు. అధ్యక్షుడు ఎర్రమళ్ళ శ్రవణ్ కుమార్ నేతృత్వంలో వాసవి మాతకు పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అమావాస్యను పురస్కరించుకుని శ్రీ ఆర్యవైశ్య వాసవి మాత సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఆర్యవైశ్య సమాజంలో ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు, పేదలు, నిరుపేదలు, భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో దాదాపుగా 500 నుంచి 600 మంది పైగా భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈనెల 13న వైశ్య భవన్ ను రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వైశ్య భవన్ కి భూమి పూజ మహోత్సవం కార్యక్రమానికి ప్రతి ఒక్క ఆర్యవైశ్యులు హాజరుకావాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి యర్రమల్ల శ్రవణ్ కుమార్, బి. కుమారస్వామి, బూశెట్టి సురేష్, పచ్చి పులుసు శ్రీనివాసరావు, కామిశెట్టి శ్రీనివాసులు,నల్లపాటి కళ్యాణ్, బుక్క రమేష్, శ్రీకాకుళం శ్రీనివాస్, తెలుకుంట్ల సుధాకర్, మంచుకొండ సురేందర్, బలుసాని కుమారస్వామి, ఇమ్మడి నారాయణ, మేడిశెట్టి వెంకటేష్,అన్నదాన ప్రసాద వితరణకు సహకరించిన దాతలు ఎర్రమళ్ళ శ్రవణ్ కుమార్, బి. కుమారస్వామి, భూశెట్టి సురేష్,పూరి సిమ్మయ్య, సి.హెచ్. నాగరాజు, కే.శ్రీనివాసులు, సంజీవ్ అగర్వాల్, పచ్చిపులుసు శ్రీనివాసరావు, శ్రీకాకుళం శ్రీనివాస్, అర్. శ్రీకాంత్, ఐశ్వర్య కుమార్, ఎస్.వి.రమణ, ఈ. నారాయణ, పోల లక్ష్మి ,బి. నాగరాజు, తెలుకుంట్ల సుధాకర్, లగిశెట్టి గురువయ్య, లగిశెట్టి వినోద్, నూనె రాణి, నల్ల శ్రీనివాస్, కే. నాగరాజు, కన్న శ్రీనివాసులు, మేడిశెట్టి వెంకటేష్, కె. రాజారావు, కె. కృష్ణయ్య, ఎ. సత్తయ్య, ఎం. రజినీకాంత్, సునీల్ అహుజా, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... అమావాస్యను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమాజానికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, సేవా కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తునికి ఖల్సాలో స్టిక్కీ ట్రాప్స్ ఏర్పాటు

- **రైతులకు ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా అవగాహన**

**వర్గల్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** వర్గల్ మండలం తునికి ఖల్సా గ్రామ రైతు వేదికలో పంటల్లో హానికర పురుగుల నియంత్రణపై రైతులకు అవగాహన కల్పించేందుకు స్టిక్కీ ట్రాప్స్ ఏర్పాటు, వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ గణేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏఈఓ అనిత, గ్రామ రైతుల సమక్షంలో కార్యక్రమం జరిగింది. కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్, రాజేంద్రనగర్‌కు చెందిన RAWEP విద్యార్థులు అనూష, లావణ్య, భార్గవి, ప్రవీణ, వెంకట హర్షిణి, హర్షద రైతులకు స్టిక్కీ ట్రాప్స్ ఏర్పాటు, వినియోగ విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు.పంటలను ఆశించే చిన్న రెక్కల పురుగులు స్టిక్కీ ట్రాప్స్‌కు ఆకర్షితమై, వాటిపై ఉన్న అంటుకునే పదార్థానికి చిక్కుకోవడం ద్వారా పురుగుల ఉనికిని ముందుగానే గుర్తించవచ్చని విద్యార్థులు తెలిపారు. పురుగుల సంఖ్యను పర్యవేక్షించడంతో పాటు, ఉధృతి పెరిగినప్పుడు తగిన నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ఇవి ఉపయోగపడతాయని వివరించారు. సమగ్ర పురుగు యాజమాన్యం (IPM)లో భాగంగా స్టిక్కీ ట్రాప్స్ పర్యావరణహిత పద్ధతిగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పసుపు స్టిక్కీ ట్రాప్స్ తెల్లదోమలు, ఆఫిడ్స్, లీఫ్‌హాపర్స్/జాసిడ్స్, సైల్లిడ్స్ వంటి పురుగుల పర్యవేక్షణకు, నీలం స్టిక్కీ ట్రాప్స్ ప్రధానంగా త్రిప్స్ పర్యవేక్షణకు ఉపయోగిస్తారని తెలిపారు.ట్రాప్స్‌ను పంటపై పురుగులు ఎగిరే ఎత్తుకు అనుగుణంగా ఏర్పాటు చేయడం, వాటిపై దుమ్ము చేరకుండా చూడటం, క్రమం తప్పకుండా పరిశీలించడం వంటి అంశాలను రైతులకు వివరించారు. ట్రాప్స్‌పై పురుగులు అధికంగా కనిపించినప్పుడు పంటను పరిశీలించి, అవసరమైన సమగ్ర పురుగు నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఈఓ అనిత మాట్లాడుతూ, రైతులు పురుగుల ఉనికిని ముందుగానే గుర్తించేందుకు స్టిక్కీ ట్రాప్స్ వంటి పర్యావరణహిత పద్ధతులను వినియోగించాలని సూచించారు. పంటలో పురుగుల స్థాయిని బట్టి మాత్రమే తదుపరి నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏఈఓ అనిత, RAWEP విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.




## శాంతియుత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలి - ఏసిపి వసంధర యాదవ్





**ఖమ్మం, కల్లూరు, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :::** గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించు కోవాలని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని గణేష్ మండపం నిర్వాహకులతో సత్తుపల్లి లోని ఏసీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల అవగాహన కోసం ఏర్పాటు చేసిన పోస్టర్లను, పాయింట్ బుక్స్ గణేష్ మండపాల నిర్వాహకులకు అందజేశారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసులకు సహకరించాలని ఏసీపీ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు అందరూ పోలీసు శాఖ పోర్టల్ policeportal.tspolice.gov.in లో రిజిస్టర్ అయి మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా మండపాల ఏర్పాటు, విగ్రహాల ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జనం తదితర కార్యక్రమాలను ముందస్తు ప్రణాళికతో నిర్వహించే అవకాశం ఉంటుందని అన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్లు మరియు వైరింగ్‌ను నిపుణులతో తనిఖీ చేయించాలని సూచించారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా అవసరమైన అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని, మండపాల వద్ద అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయకూడదని స్పష్టం చేశారు. మండపాల వద్ద భక్తులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని నిర్వాహకులకు సూచించారు. రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలు నిర్వహించకుండా నిబంధనలను పాటించాలని తెలిపారు.గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్ణయించిన మార్గాలు, సమయాలను పాటించాలని, ఊరేగింపులో పాల్గొనే వారు క్రమశిక్షణ పాటించేలా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు.నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ ప్రమాదాలు, నీట మునిగే ప్రమాదాలు తదితర ఘటనలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, ఈత రాని వారు నీటిలోకి వెళ్లకుండా నిర్వాహకులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని తెలిపారు.గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడంలో మండపాల నిర్వాహకుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి, సమస్య లేదా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రత,శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ గణేష్ నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని పోలీసు అధికారులు కోరారు.

**- గణేష్ మండపాల నిర్వాహకులకు సూచనలు**

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిర్వాహకుల పేర్లు మరియు ఫోన్ నంబర్లు పొందుపర్చాలి. విగ్రహం ఏర్పాటు స్థలం ప్రైవేట్ వ్యక్తికి చెందినదైతే, సంబంధిత వ్యక్తుల నుండి ఎటువంటి అభ్యంతర లేదని ధృవీకరణ పత్రం పొందాలి. నిర్వాహకులు విగ్రహాలను రహదారిలో కాని వివాదాస్పద స్థలాల్లో ప్రతిష్ఠించవద్దని విజ్ఞప్తి. ప్రధాన రహదారులపై, ట్రాఫిక్ రద్దీగా వుండే రహదారులపై విగ్రహాలను ఏర్పాటు చేయరాదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారించేందుకు.నాణ్యమైన విద్యుత్ తీగలు మరియు పరికరాలు గణేష్ పండల వద్దఉపయోగించాలి. మండపాల వద్ద డిజే లకు అనుమతి ఇవ్వబడదు,రెండు మైక్ తో కూడిన స్పీకర్లు(ధ్వని పరిమాణం తప్పనిసరిగా నాన్ డిస్ట్రబెన్స్ లెవెల్‌లో ఉండాలి) మాత్రమే అనుమతించబడతాయి.అదే విధంగా ఉదయం 6.00 నుండి రాత్రి 10.00 వరకు సమయాలను అనుసరించి మైక్ సౌండ్ సిస్టమ్ వినియోగించాలి. గణేష్ మండపాల వద్ద అసభ్యకరమైన నృత్యాలు, కార్యక్రమాలు చేపట్టకూడదు. ప్రతి గణేష్ మండపంలో ఇద్దరు సభ్యులు 24 గంటలు ఉండేలా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రతి గణేష్ మండపం వద్ద నోటీసు బోర్డును, పాయింట్ బుక్ ఏర్పాటు చేసి తప్పనిసరిగా నిర్వాహకుల సంప్రదింపు నంబర్లు, వివరాలను పొందుపర్చాలి. అగ్ని ప్రమాదాలను నివారించడానికి ప్రతి మండపం దగ్గర తప్పనిసరిగా ఫైర్ ప్రూఫ్‌గా ఉండేలా చూసుకోండి. తగినంత నీరు ఇసుక అందుబాటులో వుండాలి. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల గణేష్ మండపాల నిర్వాహకులు, సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి, మహిళా ఎస్ఐ కవిత, ఎస్ఐ అశోక్, సత్తుపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు గ్రామాలకు రహదారి బంద్ చేస్తారా

- వెంటనే ప్రత్యామ్నాయం దారి చూపండి : కాంగ్రెస్ నాయకులు మేకల వెంకటేశ్వర్లు



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** మండలం లోని కోనాయిగూడెం–ఆరెగూడెం గ్రామాల మధ్య నందిగామ బ్రాంచి కెనాల్ పై ప్రత్యామ్నయం రహదారి ని వెంటనే చూపాలని మండల కాంగ్రెస్ నాయకులు మేకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రహదారి లేక ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించేందుకు బ్రిడ్జిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వంతెన నిర్మాణ పనులు నత్తనడకగా వలన ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. వంతెన నిర్మాణంలో ఉన్నందున్న . కాలువ లోనే రాకపోకలకు ప్రత్యేకంగా రహదారిని ఏర్పాటు చేశారన్నారు. కానీ ప్రస్తుతం తాగునీటి సౌకర్యం కోసం కాలువలో అడంగా వేసిన రహదారి మటి ని తొలిగించారని దాని వలన రాకపోకలకు ప్రత్యామ్నయం చూపకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కోనాయిగూడెం, ఆరెగూడెం, ఆచార్లగూడెం గ్రామాల కు చెందిన ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారని అన్నారు. కనీసం మూడు కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తుందని, రైతులు నిత్యం వ్యవసాయ పనుల కోసం పోలాలకు వెళ్లాల్సి వస్తుందని...రైతులకు సాయంత్రం, రాత్రి వేళలలో ఇబ్బందిగా మారుతుందన్నారు. ఇప్పటికే నాలుగు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఇటు అధికారులు కానీ అటు కాంట్రాక్టర్ కానీ పట్టించుకోకపోవటం దారుణం అన్నారు. కనీసం పెద్ద పైపులు వేసి వెంటనే ప్రత్యామ్నయం రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనం వెంకటరెడ్డి, చెరుకుపల్లి రాజేష్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, మేకల ఆర్జున్, కర్ల ఆశోక్, బోయిన కొండలు, వుల్లోజి రాకేష్, కొత్తపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు






**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు జరిపినట్లు ప్రథమ సంవత్సర విద్యార్థినిలను ద్వితీయ తృతీయ సంవత్సరాల విద్యార్థినులు ఘనంగా విద్యా సంవత్సరానికి స్వాగతం చెపుతూ ఈ వేడుకలు నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అందరు బాగా చదివి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ ఏ జె రామారావు, అధ్యాపకులు రవిశంకర్, బొంద్యాలు, రమేష్, ప్రవీణ్, రామ కుమార్ స్వామి, సావిత్రి, మల్లేష్,శ్రీనివాస్ రావ్,రామారావు, కవిత, దీప్తి, పేరెల్లి శ్రీను, వెంకన్న, అశోక్ కుమార్, సాగరిక, సూర్యలక్ష్మి , చరిత్ర, రాజేష్ కుమార్, హేమలత, హర్షవర్ధిని, నిఖిత, జానకి రామ్ ప్రసాద్, సత్య నారాయణ, శోభారాణి, రవి కిరణ్, రవి కుమార్, నాగమణి, విజయ విద్యార్థినులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీ లో చేరిన అట్టేపల్లి రామప్రభు..

- కేటీఆర్ సమక్షంలో ఘనంగా చేరిక శేరిలింగం పల్లిలో రాజకీయ సమీకరణాలకు కొత్త ఊపు..



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :**
శేరిలింగంపల్లి లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువైన అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అట్టేపల్లి రామప్రభు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , పార్టీ సీనియర్ నాయకులు మాధవరం రంగారావు , సీనియర్ నాయకులుసిద్ధనబోయిన పురుషోత్తం యాదవ్ ఆధ్వర్యంలో అట్టేపల్లి రామప్రభు బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు.రామప్రభు తో పాటు అడప అజయ్, సోంటెనా గంగాధర్, రాజు, రాజేష్, శ్రీశైలం, ఎ ఆర్ పి టీమ్ సభ్యులు తదితరులు కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరారు.సేవ నుంచి రాజకీయ ప్రజా ప్రస్థానం వైపు మరో అడుగు..సుదీర్ఘకాలంగా ప్రజల మధ్య ఉంటూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రామప్రభు బిఆర్ఎస్ చేరిక శేరిలింగంపల్లి రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకున్న వ్యక్తిగా, ప్రజా సేవను మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు రాజకీయ వేదిక అవసరమనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు రామప్రభు తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే, ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రామప్రభు ప్రజల మధ్య చేసిన సేవకు ఇప్పుడు రాజకీయ బలం తోడైంది ప్రజల గొంతుకగా మరింత బలంగా ముందుకు సాగుతాం అని పదవి కోసం కాదు ప్రజల కోసం పనిచేయడానికి రాజకీయాల్లోకి వచ్చాం.ప్రజల నమ్మకమే మా బలం బీఆర్ఎస్ జెండా కింద ప్రజా సేవే మా లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు మారబోయిన రవికుమార్ యాదవ్,కలిదిండి రోజా,బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, గోపరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్ల నరికివేతపై కాలనీవాసుల ఆందోళన

- ప్రజయ్ వాటర్‌ఫ్రంట్ ఫేజ్–1లో భారీ వృక్షాల తొలగింపుపై అధికారులకు ఫిర్యాదు



**శామీర్‌పేట, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :**
తుర్కపల్లి పరిధిలోని ప్రజయ్ వాటర్‌ఫ్రంట్ కాలనీ ఫేజ్–1లో భారీగా చెట్లను నరికివేస్తున్నారంటూ కాలనీవాసులు, సంక్షేమ సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రి వేళల్లో సైతం చెట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే 30కి పైగా భారీ వృక్షాలను నరికివేశారని, ఇదే విధంగా కొనసాగితే సుమారు 100 నుంచి 150 వరకు చెట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.15 ఏళ్లుగా పచ్చదనమే ప్రత్యేకతప్రజయ్ వాటర్‌ఫ్రంట్ కాలనీలో పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణం ఉండటంతో నగర జీవనానికి దూరంగా ప్రశాంతంగా జీవించాలనే ఉద్దేశంతో గత 15 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నామని కాలనీవాసులు తెలిపారు. కాలనీలోని వృక్షాలను తాము కుటుంబ సభ్యుల్లా భావిస్తూ సంరక్షిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం విచక్షణారహితంగా చెట్లను తొలగించడం వల్ల కాలనీ పచ్చదనం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.డ్రైనేజీ పనుల పేరుతో తొలగిస్తున్నారని ఆరోపణడ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనుల కోసం చెట్లను తొలగిస్తున్నామని చెబుతూ విచక్షణారహితంగా వృక్షాలను నరికివేస్తున్నారని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆరోపించారు. అవసరమైన చోట మాత్రమే చెట్లను తొలగించాల్సి ఉండగా, భారీ వృక్షాలను సైతం నరికివేయడం వెనుక ఉద్దేశం ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నరికిన చెట్ల కలపను సొమ్ము చేసుకునే ప్రయత్నం జరుగుతోందన్న అనుమానాలను కూడా వ్యక్తం చేశారు.కౌన్సిలర్‌పై కాలనీవాసుల ఆరోపణలుఅలియాబాద్ వార్డు 13వ వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ యూసఫ్ బాబా తన అనుచరులతో కలిసి చెట్ల నరికివేతకు పాల్పడుతున్నారని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆరోపించారు. అయితే చెట్ల తొలగింపుపై ఒక్కొక్కరికి ఒక్కో కారణం చెబుతున్నారని వారు పేర్కొన్నారు. కొంతమందికి కోతుల బెడద కారణంగా కొమ్మలను తొలగిస్తున్నామని, మరికొందరికి డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం చెట్లను తొలగిస్తున్నామని వివిధ కారణాలు చెబుతున్నారని ఆరోపించారు.అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలికాలనీ సంక్షేమ సంఘానికి కనీస సమాచారం ఇవ్వకుండా చెట్లను తొలగించడం సరికాదని కాలనీవాసులు అన్నారు. చెట్ల నరికివేతకు సంబంధించి అనుమతులు ఉన్నాయా? డ్రైనేజీ పనుల కోసం ఎంత మేరకు చెట్ల తొలగింపు అవసరం? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అక్రమంగా చెట్లను నరికివేస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు జిల్లా ఫారెస్ట్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసి, చెట్ల నరికివేతను వెంటనే నిలిపివేసి విచారణ చేపట్టాలని కాలనీవాసులు కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు.





# పౌష్టికాహారంలో నిర్లక్ష్యాన్ని సహించం

- జాతీయ ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి: ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్





**మేడ్చల్ కలెక్టరేట్ , సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :**
జాతీయ ఆహార భద్రత చట్టం–2013ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు, ముఖ్యంగా గర్భిణీలు, బాలలు, కిశోర బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు.జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై శుక్రవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సభ్యుడు ఓరగంటి ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీఓ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2017 నుంచి జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అమలు చేస్తోందని, పౌష్టికాహారం పొందడం ప్రజల హక్కు అని అన్నారు. ఆ హక్కుకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లాలోని రేషన్ దుకాణాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ఆహారంపై నిర్వహించిన తనిఖీల్లో కొన్ని లోపాలు, సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. గర్భిణీలు, 14 ఏళ్లలోపు పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంలో కొంత నిర్లక్ష్యం కనిపించిందని, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.కిశోర బాలికల్లో రక్తహీనతపై ప్రత్యేక దృష్టికిశోర బాలికల్లో రక్తహీనత అధికంగా ఉందని చైర్మన్ పేర్కొన్నారు. వారికి పౌష్టికాహారంతో పాటు పాలు, పండ్లు అందించి రక్తహీనతను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పిల్లల ఎదుగుదలకు అవసరమైన బాలామృతం, ఇతర పౌష్టికాహారం సక్రమంగా అందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు.మెనూ ప్రకారమే భోజనం అందించాలిపాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. దమ్మాయిగూడ పాఠశాలలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, హాజరు పట్టికల విషయంలో నిర్లక్ష్యం గుర్తించిన నేపథ్యంలో సంబంధిత హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్ల నాణ్యత విషయంలో కాంట్రాక్టర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు.నెలకోసారి తనిఖీలు తప్పనిసరివిద్య, వైద్య, మహిళా–శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు ప్రతి నెలా రెసిడెన్షియల్ పాఠశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా ఆకస్మిక తనిఖీలు చేపట్టి నివేదికలు సమర్పించాలని, అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించేలా చూడాలని సూచించారు.ఎన్నికలు, సర్వేలు వంటి ఇతర విధులకు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను కేటాయించే సమయంలో వారి స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పిల్లలకు భోజనం, పౌష్టికాహారం అందించే అవకాశం అందరికీ రాదని, మానవతా దృక్పథంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని చైర్మన్ కోరారు.ఈ సమావేశంలో నోడల్ అధికారి సాంబశివరావు, సంక్షేమ శాఖల అధికారులు ఝాన్సీరాణి, వినోద్‌కుమార్, పద్మజ, కాంతమ్మ, డీఎంహెచ్ఓ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారదతో పాటు వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెడ్‌మాస్టర్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ సెస్ బకాయిలు సకాలంలో చెల్లించాలి

- ప్రతి నెల రూ.2 లక్షల చొప్పున బకాయిలు చెల్లించేందుకు చర్యలు
- అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్



**మేడ్చల్ కలెక్టరేట్ , సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** జిల్లాలో గ్రంథాలయ సెస్‌ను సక్రమంగా, సకాలంలో వసూలు చేసి జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలను ప్రాధాన్యతతో చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో గ్రంథాలయ సెస్ వసూళ్లు, పెండింగ్ బకాయిల చెల్లింపులు, గ్రంథాలయాల అభివృద్ధికి నిధుల సమీకరణపై అదనపు కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం ఆయన ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పేరం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వివిధ మున్సిపాలిటీల వద్ద పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలను ప్రతి నెల రూ.2 లక్షల చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. దీనికి సంబంధిత మున్సిపల్ అధికారులు అంగీకరించి, నిర్ణీత విధానంలో బకాయిల చెల్లింపులు చేపడతామని తెలిపారు.

**ఐదు నెలల్లో రూ.5 కోట్లకు పైగా వసూళ్లు**

2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ.4 కోట్ల గ్రంథాలయ సెస్ వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లోనే వివిధ స్థానిక సంస్థల నుంచి రూ.5 కోట్లకు పైగా సెస్ వసూలు కావడం పట్ల సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది. మిగిలిన కాలంలో వసూళ్లను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాన్ని మించి సెస్ వసూలు చేయాలని అధికారులకు సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గతంలో నెలకు సుమారు రూ.5 లక్షల చొప్పున గ్రంథాలయ సెస్ అందేదని, అయితే ఏప్రిల్ 2026 నుంచి ఇప్పటివరకు ఆ మొత్తం అందకపోవడంపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ సెస్‌ను వెంటనే విడుదల చేయించేలా సంబంధిత అధికారులకు లేఖలు రాసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

**విద్యార్థులకు పఠన గదులు ఏర్పాటు చేయాలి**

మున్సిపాలిటీల పరిధిలో విద్యార్థులు, యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడేలా ప్రజా పఠన గదులను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను కోరారు. పఠన గదుల్లో వార్తాపత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు స్థానిక సంస్థలు సహకరించాలని సూచించారు.గ్రంథాలయ సెస్ ద్వారా లభించే ఆదాయం గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సౌకర్యాలు, నూతన గ్రంథాలయ సేవల విస్తరణతో పాటు విద్యార్థులు, యువతకు అధ్యయన సదుపాయాల కల్పనకు ఉపయోగపడుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.గ్రంథాలయ సెస్ వసూళ్లు, పెండింగ్ బకాయిలు, చెల్లింపుల పురోగతిపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేసి సెస్‌ను పూర్తిస్థాయిలో, సకాలంలో వసూలు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. స్థానిక సంస్థలు జిల్లా గ్రంథాలయ సంస్థతో సమన్వయంతో పనిచేసి గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.

## పౌష్టికాహారంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

**మేడ్చల్ కలెక్టరేట్ , సెప్టెంబర్ 11, నేటి శుభోదయ** గర్భిణులు, చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పౌష్టికాహారం అందిస్తోందని, అందులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతితో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించి రేషన్ దుకాణాలు, సంక్షేమ వసతి పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న చైర్మన్, సభ్యులకు కీసర ఆర్డీఓ వెంకట్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం మేడ్చల్‌లోని చౌకధరల దుకాణాలను తనిఖీ చేసిన చైర్మన్ స్టాక్ వివరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణాల వద్ద ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాలని, జిల్లా పౌరసరఫరాల అధికారి, తహసీల్దార్ల ఫోన్ నంబర్లను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. సన్నబియ్యం సక్రమంగా అందుతున్నదా, డీలర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బియ్యం పంపిణీ చేస్తున్నారా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కిష్టాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ వసతి పాఠశాలను సందర్శించి భోజనశాల, నిల్వ గదులను పరిశీలించారు. గడువు ముగిసిన సరుకులను వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యమైన సన్నబియ్యంతోనే విద్యార్థులకు భోజనం తయారు చేయాలని సూచించారు. బియ్యం నాణ్యతలో లోపాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి మార్చుకోవాలని తెలిపారు. పాఠశాలలో ఉడికించిన గుడ్ల రంగు మారడాన్ని గమనించిన చైర్మన్, వాటిని సేకరించి ఆహార భద్రత అధికారులు పరీక్షలు నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు.విద్యార్థుల ఆరోగ్య పరీక్షల రిజిస్టర్లను పరిశీలించిన ఆయన, రక్తహీనత ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన పౌష్టికాహారం అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారా అని ఆరా తీసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలు, నిర్దేశిత మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం, చిరుతిళ్లు అందుతున్నాయా, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా అని తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.దమ్మాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కమిషన్ సభ్యులు, పలువురు విద్యార్థులు ఇంటి నుంచి భోజనపు పెట్టెలు తెచ్చుకోవడాన్ని గమనించారు. దీనిపై విద్యార్థులను ప్రశ్నించగా పాఠశాలలో అందించే భోజనం సక్రమంగా ఉండటం లేదని వారు తెలిపారు. దీనిపై స్పందించిన చైర్మన్ లోపాలను సరిదిద్ది విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని, అవసరమైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం దమ్మాయిగూడ అంబేద్కర్‌నగర్, జవహర్‌నగర్, మల్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను కమిషన్ బృందం పరిశీలించింది. కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణుల సంఖ్యతో పాటు వారికి అందుతున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు తదితరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజన మెనూను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.గర్భిణులు, 14 ఏళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం పొందడం చట్టబద్ధమైన హక్కు అని గోలి శ్రీనివాస్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వారి హక్కు మేరకు పౌష్టికాహారం అందేలా చూడటం కమిషన్ బాధ్యత అన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ కమిషన్ సభ్యులు గర్భిణులకు తమ సంప్రదింపు వివరాలను అందజేశారు.ఈ పర్యటనలో నోడల్ అధికారి సాంబశివరావు, సంక్షేమ శాఖల అధికారులు ఝాన్సీరాణి, వినోద్‌కుమార్, పద్మజ, కాంతమ్మ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆనంద్, పౌరసరఫరాల శాఖ అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.



## భ్రూణ లింగ నిర్ధారణకు అడ్డుకట్ట వేయాలి

- చట్ట నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
  : జిల్లా వైద్యాధికారి డా. కె. ఆనంద్



**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** జిల్లాలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను పూర్తిస్థాయిలో అరికట్టడంతో పాటు, సంబంధిత చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ అన్నారు. వైద్య సంస్థలు చట్టబద్ధమైన, నైతిక ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆమోదంతో ఏర్పాటైన జిల్లా గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిరోధక సలహా కమిటీ సమావేశం డా. కె. ఆనంద్ అధ్యక్షతన అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలో నూతనంగా అల్ట్రాసౌండ్ కేంద్రాలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, చిత్రీకరణ కేంద్రాల ఏర్పాటుకు వచ్చిన 18 దరఖాస్తులను, ఇప్పటికే కొనసాగుతున్న కేంద్రాల పునరుద్ధరణకు సంబంధించిన 12 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. ఆయా సంస్థలకు అనుమతులు మంజూరు చేయడం, పునరుద్ధరణ ప్రక్రియ చేపట్టడం వంటి అంశాలను చట్ట నిబంధనలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలించారు.ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శక విధానంలో నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని వైద్య సంస్థల కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, చట్ట ఉల్లంఘనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా డా. ఆనంద్ మాట్లాడుతూ.. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను నిరోధించడం, ఆడ శిశువుల సంరక్షణకు భరోసా కల్పించడం, వైద్య రంగంలో చట్టబద్ధతతో పాటు నైతిక విలువలను కాపాడటం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన బాధ్యత అని అన్నారు. చట్ట నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమావేశంలో జిల్లా స్థాయి సలహా కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు, వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన నలుగురు జర్నలిస్టుల శ్రమ

- అనలాగ్ (కల్తీ) పనీర్ కు అడ్డుకట్ట.. గెజిట్ విడుదల
- కల్తీ పన్నీర్ దందాపై వరుస కథనాలు, అధికారుల దృష్టికి అక్రమ సరఫరా కేంద్రాలు
- సికింద్రాబాద్ నుంచి తిరుమలగిరి, కుషాయిగూడ, హబ్సిగూడ, మేడిపల్లి వరకు వెలుగులోకి తెచ్చిన వ్యవహారం.
- ప్రభుత్వం స్పందించడంతో కల్తీ పన్నీర్‌పై కఠిన చర్యలు
- కల్తీ పన్నీర్ వ్యవహారంలో ప్రభుత్వం స్పందించడంపై జర్నలిస్టుల హర్షం












O/o Commissioner, Telangana Standards Authority for Food and Essential drugs (TG SAFE)

No. 07/FSS/TG SAFE/2026 Dated: 11.09.2026

// PRESS NOTE //

Sub: Food Safety and Standards Act, 2006 – Prohibition of manufacture, processing, storage, distribution, transportation and sale of analogue /non-dairy paneer being manufactured, stored, distributed or sold as "Paneer" or otherwise – Order Notified in official gazette – Issued.

***

It is to inform that in exercise of the powers conferred under clause (a) of Sub-section (2) of Section 30 of Food Safety and Standards Act, 2006 and in the interest of public health, Commissioner of Food Safety, Telangana State issued orders prohibiting the manufacture, processing, packing, storage, distribution and sale of non-dairy/artificial paneer/analogue paneer in any form throughout the State of Telangana for a period of one year with immediate effect from 10.09.2026. The order is notified in the official gazette bearing No 807 Dated 10.09.2026

The copy of the gazette notification is enclosed herewith. Hence, the same may be published in the Print and electronic Media for dissemination of information to the general public.

Sd/-
Commissioner
Telangana Standards Authority
for Food and Essential drugs (TG SAFE)

Copy submitted to:-
The Peshi of Commissioner, Telangana Standards Authority for Food and Essential drugs

**హైదరాబాద్, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పన్నీర్ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడంలో నలుగురు జర్నలిస్టుల కృషి ఫలించింది. గౌటి రామకృష్ణ, బొడికె వాణి, గంగి కృష్ణ, సతీష్‌లు కలిసి కల్తీ పన్నీర్ తయారీ, ప్యాకింగ్, సరఫరాకు సంబంధించిన పలు అంశాలను పరిశోధనాత్మక కథనాల ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చారు. పలు ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ విక్రయాలు, సరఫరా తీరును సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి దాడులు జరిగేలా సమాచారం అందించారు.

**అధికార యంత్రాంగాన్ని కదిలించిన కథనాలు**

సికింద్రాబాద్, తిరుమలగిరి, మేడిపల్లి, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో కల్తీ పన్నీర్ విక్రయాలు, సరఫరాపై సమాచారం సేకరించిన జర్నలిస్టులు సంబంధిత పోలీసు, ఫుడ్ సేఫ్టీ అధికారులకు వివరాలు అందించినట్లు తెలిపారు. ఎక్కడ తయారు చేస్తున్నారు.? ఎక్కడ ప్యాకింగ్ చేస్తున్నారు.? ఏ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు.? అనే అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా హబ్సిగూడ వీధి నంబర్ 8లో రోడ్డుపైనే పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్నారన్న సమాచారాన్ని కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు నలుగురు జర్నలిస్టులు పేర్కొన్నారు. అయితే సకాలంలో స్పందన లేకపోవడంతో పరిస్థితి మరింత తీవ్రమైందని కల్తీ పన్నీర్ మాఫియా సభ్యులు తమ అక్రమ దందాను అడ్డుకుంటున్నారని జర్నలిస్టులపైనే దాడులు చేశారని పేర్కొన్నారు

**ప్రభుత్వం సీరియస్.. కల్తీకి చెక్**

కల్తీ ఆహార పదార్థాలపై వస్తున్న ఫిర్యాదులు, మీడియా కథనాల నేపథ్యంలో పోలీసు, ఫుడ్ సేఫ్టీ యంత్రాంగం వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి విషయం వెళ్లడంతో కల్తీ పన్నీర్ సరఫరాపై చర్యలు ముమ్మరమయ్యాయని పేర్కొన్నారు.కల్తీ పన్నీర్‌పై నియంత్రణకు ప్రభుత్వం స్థాయిలో చర్యలు చేపట్టడం ప్రజా ఆరోగ్య పరిరక్షణలో కీలక పరిణామమని గౌటి రామకృష్ణ, బొడికె వాణి, గంగి కృష్ణ, సతీష్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. కల్తీ పన్నీర్ సరఫరాకు అడ్డుకట్ట వేయడంలో అధికార యంత్రాంగం మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

**కల్తీని ప్రశ్నిస్తే జర్నలిస్టులపైనే కేసులా.?**

ఒకవైపు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆ నలుగురు జర్నలిస్టులు కల్తీ ఆహారంపై వరుస కథనాలు రాయడంతో పాటు, అధికారులకు సమాచారం అందిస్తుంటే, మరోవైపు తమపైనే కేసులు నమోదు కావడం బాధాకరమని నలుగురు జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. హబ్సిగూడ వీధి నెంబర్ 8 లో కల్తీ పన్నీర్ సరఫరా, రోడ్డు పక్కన ప్యాకింగ్ జరుగుతోందన్న సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలోనే కల్తీ పన్నీర్ సరఫరాదారుల విషయాలను తీసుకువచ్చి జర్నలిస్టుల పైననే దాడులు చేయడంతో పాటు ఆర్థిక రాజకీయ బలాన్ని ఉపయోగించి తమపై కేసులు నమోదయ్యాయని వారు పేర్కొన్నారు.కల్తీ వ్యవహారాన్ని ప్రశ్నించాల్సిన ఓయూ పోలీసులు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం పట్ల ప్రజల్లోనూ చర్చ జరుగుతోందని వారు పేర్కొన్నారు. కల్తీ పన్నీర్ మాఫియా సభ్యులు జర్నలిస్టులపై దాడి చేయడం మహిళా జర్నలిస్ట్ అని చూడకుండా ఆమెపై దాడి చేయడంతో పాటు అసభ్య పదజాలాలతో దూషించి బలవంతంగా ఫోన్ లాక్కోవడం జరిగిందని, ఆ వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో పోలీసు ఉన్నత అధికారులు సైతం ఆ వీడియోలని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. జర్నలిస్టులపైనే దాడి చేసి వారిపైనే కేసులు పెట్టించారు అంటే ఇక కల్తీ పన్నీర్ మాఫియా బలం ఎంత గట్టిగా ఉందో ఉన్నత అధికారులకే తెలియాలి. అయితే ఈ వ్యవహారంపై సంబంధిత పోలీసు అధికారుల వివరణ కూడా వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది.

**కేసులు పెట్టినా.. ప్రజా ఆరోగ్య పోరాటం ఆగదు**

కల్తీ పన్నీర్ వ్యవహారం వెలుగులోకి రావడంతో పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవడంపై గౌటీ రామకృష్ణ, బొడికే వాణి, గంగి కృష్ణ, సతీష్ జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం తాము చేసిన కృషికి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించడం సంతోషకరమని తెలిపారు.అయితే కల్తీని వెలుగులోకి తీసుకొచ్చిన జర్నలిస్టులను అధికారులు ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు ఏర్పడటం బాధాకరమన్నారు. పోలీసు శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు సహకరిస్తే భవిష్యత్తులో మరిన్ని కల్తీ ఆహార కేంద్రాలను వెలుగులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కల్తీ ఆహారంపై పోరాటం ఒక్క శాఖ బాధ్యత కాదని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మీడియా, పోలీసు, ఫుడ్ సేఫ్టీ, ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. కల్తీ దందా వెనుక ఎవరున్నా, ఎంతటి పలుకుబడి ఉన్నా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి : కొదుమూరి జగన్నాదం



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం గం. 8–00 లకు ఉప్పల్ భగాయత్ లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవన సముదాయాల చారిత్రాత్మక నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం శ్రీనివాస కళ్యాణం జరుగుతుంది. తదనంతరం ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి వి చేయుచున్నారు. కావున ఈ సమావేశానికి మన ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య బంధు మిత్రులందరూ తప్పక విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొదుమూరి జగన్నాథం కోరారు.ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, మండల కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాలు యువజన సంఘం, మహిళా సంఘం, సేవాదళ్, రాజకీయ విభాగం, విద్యా కమిటీల సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షులు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శులు, మాజీ జిల్లా కోశాధికారులు అందరూ తప్పకుండా హాజరు కావాల్సిందిగా కొదుమూరి కోరారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీలోకి మల్లెబోయిన ఉపేందర్




**ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన మల్లెబోయిన ఉపేందర్ కు ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. గురువారం యాదగిరిగుట్టలో నిర్వహించిన ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఉపేందర్‌ను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామస్థాయి నుంచి యువజన ఉద్యమంలో చురుకుగా పనిచేస్తూ మండల, జిల్లా స్థాయిలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపేందర్‌కు రాష్ట్ర కమీటీలో చోటు దక్కడం నేలకొండపల్లి మండల యువజన ఉద్యమానికి దక్కిన గౌరవంగా పలువురు నాయకులు కొనియాడారు. యువత సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఏఐవైఎఫ్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.ఉపేందర్ ఎన్నిక పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్, కనకబండి సీతారాములు, మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావుతో పాటు పలువురు సీపీఐ నాయకులు, ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.యువజన ఉద్యమంలో మరింత క్రియాశీలంగా పనిచేస్తూ నిరుద్యోగం, డ్రగ్స్ నియంత్రణ, విద్య, ఉపాధి తదితర సమస్యలపై యువత తరఫున పోరాటాలను ఉధృతం చేయాలని వారు ఆకాంక్షించారు.

# విద్యార్థుల పైశాచిక తత్వం

**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** విద్యార్థులు తాము చదివే కళాశాలలో ఏదైనా ఫంక్షన్స్ నిర్వహిస్తే కాలేజీల ఆస్తులను ధ్వంసం చేయడం పరిపాటిగా మారింది. ఇది ప్రతి సంవత్సరం ఇటువంటి సంఘటనకు పాల్పడిన విద్యార్థులపై ఏ కళాశాలైన వారి చదివే విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలు తీసుకపోతే మరింత పేట్రేగిపోయే అవకాశం ఉంది. తాము చదివే క్లాస్ రూములలో ఎలక్ట్రిక్ బోర్డ్ స్విచ్ లను, ఫ్యాన్లను ధ్వంసం చేస్తున్నారు. దీనికి తోడు బల్లాలపై పిచ్చిపిచ్చి రాతలు రాయటం. కళాశాలల ఆవరణలో ఇతరులు పెట్టిన వాహనాలపై కూర్చొని ఖరాబు చేయడం జరుగుతుంది. కొందరి మూలంగా క్లాసుల్లో సైతం కొందరు అల్లరి మూకలు డిస్టబెన్స్ చేయడం వల్ల ఇతర విద్యార్థులకు తీవ్ర సౌకర్యం ఏర్పడుతుంది. కాలేజీ ప్రాంగణంలో క్లాస్ రూముల నిత్యం సెల్ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారు. క్లాసులు పోకుండా కళాశాల ఆవరణలో గుంపులు, గుంపులుగా చేరి అల్లరి చిల్లరగా ప్రవర్తిస్తున్నారు. మందలిస్తే సెల్ ఫోన్ ఆఫ్ చేయమంటే దురుసుగా ప్రవర్తించడం పెడచెవిని పెట్టడం జరుగుతుంది. తాము చేసినందుకు ఎదురు తిరిగే సమాధానాలు ఒప్పుకొని సమాధానం చెబుతున్నారు. కళాశాలలోని ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం యాజమాన్యంపై ఉంది. ఇటువంటి వారిపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసి వారిని అదుపులో పెట్టుకోమని చెప్పాల్సిన బాధ్యత కూడా ఉంది. లెక్చరర్ లో అంటే గౌరవం ఉండదు పెద్దలంటే గౌరవం ఉండదు విద్యార్థులు బయట వారితో ఘర్షణ పడుతూ కాలేజీకి తలనొప్పిగా మారుతున్నారు. వీరిని క్షమించకుండా కళాశాల నుండి సస్పెండ్ గాని డిస్మిస్ కానీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అబ్బాయిలే కాదు అమ్మాయిలు సైతం క్లాసులకు పోకుండా ప్రచారాలు చేస్తూ నిత్యం సెల్ఫోన్తో కాలక్షేపం చేస్తూ కొందరు ఉన్నారు. కొందరైతే గ్రూపులుగా ఏర్పడి క్లాసులు పోకుండా నిత్యం ఎక్కడో ఒక చోట ఉంటూ తలనొప్పిగా మారుతున్నారు. వీరిపై చర్యలు తీసుకొని తల్లిదండ్రులకు ఇన్ఫర్మేషన్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇటువంటి సంఘటనలు ఖమ్మం పట్టణాన్ని కొన్ని కళాశాలలో జరగటం శోచనీయం. కొందరు లెక్చరర్ లు కారణంగా చెప్పవచ్చు. ఏది ఏమైనా కళాశాలలో యూనిటీ మెయింటైన్ చేస్తూ విద్యార్థులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం అధ్యాపకులపై కూడా ఎంతైనా ఉంది. ఉదాసీన వైఖరిని విడనాడాలి. ప్రతి కాలేజీలో క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు లెక్చరాలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం . తమ పిల్లలు తప్పు చేసిన లెక్చరర్లపై యాజమాన్యాలపై తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తే వారి భవిష్యత్తును స్వయానా తల్లిదండ్రులు నాశనం చేసుకున్నట్లు అవుతారు కావున పిల్లలపై పర్యవేక్షణ అత్యంత ముఖ్యమైన విషయం.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎస్కే చాంద్ పాషా ఎన్నిక

**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఈనెల 8.9.10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగిన ఏఐవైఎఫ్ మూడవ తెలంగాణ రాష్ట్ర మహాసభలో జూలూరుపాడు మండలం వెంగనపాలెం గ్రామానికి చెందిన ఎస్కే చాంద్ పాషా ను రాష్ట్ర సమితి సభ్యుడుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేస్తున్నారని ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మోసం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి హామీని నిలబెట్టుకోవాలని, రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో నమ్మకంతో రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు, సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా కు ధన్యవాదాలు తెలియజేశారు.




## మేరా రేషమ్ మేరా అభిమాన్ 2.0" కార్యక్రమం



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా, ఇల్లూరు, మధిర మండలంలో శుక్రవారం కేంద్ర సిల్క్ బోర్డు, బెంగళూరు, తెలంగాణ రాష్ట్ర సెరికల్చర్ శాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్త–రైతు పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటల నిర్వహణ, ఆధునిక సాంకేతిక పద్ధతులు, మల్బరీ వేరుకుళ్ళు వ్యాధి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. జి. సుబ్రహ్మణ్యం, సీనియర్ సైంటిస్ట్, సి ఎస్ బి, శ్రీ కామేశ్వరరావు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్; శ్రీ దేవరాజు, అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## జాతీయ మహిళా,మానవ హక్కుల కమిషన్లకు వినతిపత్రాలు అందజేసిన ఎం పి వద్దిరాజు బృందం





**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని తమను అసెంబ్లీలోకి అడుగుపెట్టనివ్వకుండా దౌర్జన్యంగా వ్యవహరించిదని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఢిల్లీలో జాతీయ మహిళా, మానవ హక్కుల కమిషన్లకు ఫిర్యాదు చేశారు.ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీ,ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తదితరులు మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహత్కర్,మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతిలను ఢిల్లీలో శుక్రవారం కలిశారు.ఈ సందర్భంగా వారు అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి తీరు గురించి ఫోటోలు,పేపర్ కటింగ్స్, వీడియోలు,ఆధారాలతో సహా వివరించారు.మహిళా,మానవ హక్కుల కమిషన్లకు కాంగ్రెస్ సర్కార్,పోలీసుల అనుచిత వైఖరిపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేసి, వినతిపత్రాలు అందజేశారు,చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,దీవకొండ దామోదర్ రావు, ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,గుంటకండ్ల జగదీష్ రెడ్డి,ప్రముఖ న్యాయవాది సోమ భరత్ కుమార్ తదితరులు ఉన్నారు.

## సారంగాపూర్ మజీదు కూల్చివేత ముస్లింలపై దాడులను ఖండిస్తూ నిరసన ప్రదర్శన



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ** ఒక పథకం ప్రకారంగా బీజేపీ ప్రభుత్వం ఏదో ఒక సాకుతో మసీదులను, మదర్సాలు కూల్చివేతలు మైనార్టీలపై దాడులు చేస్తూ మైనార్టీల హక్కులను కాలరాస్తూ ఇష్టారాజ్యంగా మతోన్మాదంతో రెచ్చిపోయి ప్రధాన స్థలాలలో కూల్చివేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దీనిని ఖండిస్తూ శుక్రవారం ముస్లిం మైనార్టీలు మసీద్ వాహిదీయా నుండి శ్రీదేవి హాస్పిటల్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనలో ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచారం కార్యదర్శి మొహమ్మద్ సలాం మాట్లాడుతూ యూపీ సారంగాపూర్ లో 1911లో కలెక్టరేట్లో మసీదును నిర్మించడం జరిగింది. మసీదు ఇటికలపై 1909 లో తయారైనవి అని కరెంట్ బిల్లుతో సహా వక్ఫ్ ద్వారా ఇచ్చిన స్థలం మసీదు వారే కలెక్టర్ ఆఫీస్ కి స్థలం ఇచ్చారని దానిలో మందిరం కూడా ఉందని అయినా కూడా అధికారాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికలలో దృష్టిలో పెట్టుకొని అబద్ధాలతో తెల్లవారుజామున మసీదులను కూల్చివేశారూ కనీసం ఖురాన్, పవిత్ర గ్రంథాలను కూడా తీసుకొనివకుండా కూల్చివేశారని మీది ఏం ఉంది మీరు వెళ్ళిపోవాలి అనే వారు దీనిని గుర్తుంచుకోవాలి దేశంలో ఉన్న పురాతన కట్టడాలు భూములు నవాబులు కట్టించిన మందిరాలు ఇచ్చిన దాన ధర్మాలు కూడా గుర్తు పెట్టుకోవాలి. రెచ్చగొడితే చూసి సమన్వయం పాటిస్తున్నారని ఇక ఓపిక నశిస్తుందని సలాం హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సైదా, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఎస్కే గౌస్ అవజ్, నాయకులు ఎస్కే హుస్సేన్, మాన్ వహిదియ మసీద్ సదర్ ఎస్కే రసూల్ ముఫ్తి నూరూర్ ఇస్లాం ఎస్కే మీరా షకీల్ యాకుబ్ జాని డాక్టర్ ఖాసిం పాషా అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య





**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రారంభించారు.నగర పాలక సంస్థ పరిధిలోని డివిజన్లలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఓల్డ్ బస్టాండ్, కల్వొడ్డు, ఇల్లందు క్రాస్‌రోడ్ తదితర ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ఉపయోగించి పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో టిఎంసి సుజాత, నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతుల పంపిణీ



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** పర్యావరణహితమైన మట్టి విత్తనగణపతులను ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ఐ.క్యూఏసి, ఎకో క్లబ్ –ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో బంకమట్టితో తయారు చేసి సహ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐ.క్యూఏసికోఆర్డినేటర్ డా.ఎం.సునంద, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ ఇంద్రాణి, ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.రమాసత్యవతి ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా.ఎం.పిచ్చయ్య,డా.ధర్మయ్య అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కవిత కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు






**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** విద్యార్థుల జీవితంలో డిగ్రీ దశ అత్యంత కీలకమని ఈ దశలోనే విద్యార్థులు తమ జీవితాన్ని నిర్మించుకోవాలని కవిత కళాశాలల కరస్పాండెంట్ పారుపల్లి ఉషా కిరణ్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని స్థానిక గట్టయ్య సెంటర్ ఉపేంద్ర నగర్ లో గల కవిత డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఘనంగా ఫ్రెషర్స్ డేని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ విద్యార్థులకు జీవితంలో ఎలాంటి ఆటుపోట్లు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని మరియు ఖచ్చితమైన ప్రణాళిక సమయస్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కవిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే తమ నైపుణ్యాలను మరింతగా మెరుగుపరుచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కవిత కళాశాల చైర్మన్ యలముడి రవీందర్ , కవిత కళాశాల కోశాధికారి బుచ్చి రామయ్య, కవిత పిజి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పారుపల్లి రోజా రాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దళిత ద్రోహులకు బుద్ధి చెప్పేదాకా వదలం

- ఖమ్మంలో కాంగ్రెస్ దళిత గర్జన
- బీఆర్ఎస్, బీజేపీ దళిత వ్యతిరేక ముఠాలు
- ర్యాలీలో నిప్పులు చెరిగిన జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల్లు నూతి సత్యనారాయణ గౌడ్, నాగండ్ల దీపక్ చౌదరి




**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక, మనువాద దాష్టీకాన్ని ఖండిస్తూ ఖమ్మంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ గర్జన చేశాయి. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో సంజీవరెడ్డి భవన్ నుండి జెడ్పీ సెంటర్ లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు వేలాది మంది కార్యకర్తలతో బీ ఆర్ ఎస్, బీ జె పి పార్టీల దళిత వ్యతిరేక చర్యలను ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి అని తెలిపారు. ఉత్తరాఖండ్ లో ఏఐసీసీ అధ్యక్షుడు, దళిత బిడ్డ మల్లికార్జున ఖర్గే కాలు పెట్టిన ప్రదేశాన్ని బీజేపీ మనువాదులు పసుపు నీళ్లతో కడిగిన వికృతం మరువక ముందే తెలంగాణలో అదే సంస్కృతిని బీఆర్ఎస్ కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు."రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లాంటి దళిత నాయకుడిపై శాసనమండలి సభ్యుడు తాతా మధు కారు కూతలు కూయడం, ఆపై దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి రోడ్లను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం, ఇది దళితుల ఆత్మ గౌరవంపై దాడి కాదా? ఇది అంటరానితనం కాదా? బీఆర్ఎస్ అనేది దళిత ద్రోహుల పార్టీ అని మరోసారి తేలిపోయింది" అని అన్నారు. అదే విధంగా ప్రజా సమస్యలను లోతుగా చర్చించి పరిష్కారమార్గం వెతకడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు మరియు సహచర మంత్రివర్గ సభ్యులు ప్రజా పాలన గావిస్తున్న ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నారని అది చూసి ఓర్వలేని బీ ఆర్ ఎస్ నాయకులు ఉద్దేశ్య పూర్వకంగా ఒక ఘర్షణ వాతావరణం సృష్టించి అలజడి అశాంతి లేపి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారని నూతి సత్యనారాయణ గౌడ్,నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు అన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మంచి ప్రవర్తనతో మెలగాలని, లేకపోతే తెలంగాణ ప్రజలు మరోసారి బొంద పెడతారని హెచ్చరించారు. తాతా మధు సూదన్ శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు."పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనే బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు తగిన శాస్తి చేశారు. విజ్ఞత గల తెలంగాణ ప్రజలు మీ దళిత వ్యతిరేక చర్యలను నిశితంగా గమనిస్తున్నారు" అని అన్నారు.ఈ ర్యాలీకి పిలుపు ఇచ్చిన వెంటనే జిల్లా నలుమూలల నుండి భారీగా తరలివచ్చి జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, పట్టాభి, అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, విప్లవ కుమార్ తదితర జిల్లా నాయకులు , బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు భారీగా పాల్గొన్నారు.

## బంజారా ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ కు బంజారాలు వచ్చే ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్తారు

- బంజారా ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలి
- సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు భూక్యా నరసింహారావు డిమాండ్




**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్రంలో జనాభా పరంగా మూడో స్థానంలో ఉన్న బంజారా (లంబాడీ) సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం తీవ్ర అన్యాయమని సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా అధ్యక్షులు భూక్యా నరసింహా నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కొణిజర్ల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యమంత్రి తీరును తీవ్రంగా ఖండించారు.రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న బంజారా సమాజంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని భూక్యా నరసింహా నాయక్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా, కేబినెట్‌లో బంజారా సామాజిక వర్గానికి చెందిన బిడ్డకు స్థానం కల్పించకపోవడం తమ సమాజాన్ని తీవ్రంగా అవమానించడమేనని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బంజారా సోదరులు ఓట్లతో బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించుకొని, చేసిన తప్పును తెలుసుకొని వెంటనే బంజారా నాయకుడికి కేబినెట్ మంత్రిగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలోనూ, ప్రభుత్వాన్ని నడిపించడంలోనూ బంజారా సమాజం కీలక పాత్ర పోషిస్తోందని గుర్తుచేశారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకుండా బంజారా బిడ్డకు మంత్రి పదవి నిరాకరిస్తే, తమ ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ సాక్షిగా ఈ ప్రభుత్వానికి, కాంగ్రెస్ నాయకులకు రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు సంజీవ్ నాయక్ , రాష్ట్ర అధ్యక్షులు బానోత్ హుస్సేన్ నాయక్ నేతృత్వంలో బంజారాల హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే దిగిరాకపోతే ప్రతి తండా నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసన సెగ తగిలిస్తామని స్పష్టం చేశారు. తక్షణమే రాబోయే మంత్రివర్గ విస్తరణలో బంజారా ప్రతినిధికి చోటు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు లకావత్ దేవేందర్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భుక్యా వినోద్ కుమార్ రాథోడ్, కార్యదర్శి ఇస్లావత్ చందు నాయక్, సేవాలాల్ సేన నాయకులు, బంజారా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## గణితం జిజ్ఞాస ప్రాజెక్టు కు రాష్ట్ర ప్రథమ బహుమతి



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ప్రతి వార్షిక సంవత్సరం తెలంగాణ కళాశాల విద్యా కమిషనరేట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలో నిర్వహించే జిజ్ఞాస విద్యార్థి కేంద్రక అధ్యయన పోటిలో ఈ వార్షిక విద్యా సంవత్సరం ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల గణితం విభాగం అధ్యాపకురాలు కె.వి.ఆర్ కనకదుర్గ పర్యవేక్షణలో "బౌధాయనునిశులభ సూత్ర జ్యామితి ఆధారంగా రూపొందించిన నిర్ణీత ప్రాక్టల్ అరె యాంటెన్నా సంశ్లేషణ పద్ధతి " అనే అంశంపై సమర్పించిన అధ్యయన నివేదికకు రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి లభించినదని కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా శుక్రవారం అభినందన పూర్వక ప్రకటనలో తెలిపారు. ఈప్రాజెక్టులో పి.రిషిక బి.సి.ఏ తృతీయ,ఎన్.మీనాక్షి బి.సి.ఏ ద్వితీయ,పీ.శ్రావణి బి.సి.ఏ ప్రథమ , ఎస్.కె.ఉద్దండు బి.సి.ఏ ప్రథమ,బి.గణేష్ బి.ఎస్.సి తృతీయ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.ఈ సందర్భంగా ఐ.క్యూఏసి ఆధ్వర్యంలో అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి,డా.ఎం.సునంద, ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.రమాసత్యవతి, అకాడమిక్ కోఆర్డినేటర్ డా.బి.వీరన్న, గణిత విభాగాధిపతి పిల్లా శ్రీనివాస్, వివిధ విభాగాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

# ఖమ్మం లో మెడికల్ వేస్ట్ కలకలం

- నోటీసులు ఇవ్వరా.....?
- అసలు వ్యర్థాలు ఎక్కడికి వెళ్తున్నాయి?
- ఆసుపత్రి గేటు దాటిన తర్వాత బయోమెడికల్ వేస్ట్ ప్రయాణం ఎటు?
- పసుపు, ఎరుపు, తెలుపు, నీలం కలర్ కోడింగ్ పాటిస్తున్నారా?
- అసలు ఇన్వెస్టిగేషన్ ఇక్కడే మొదలు
- "చెత్త" కాదు, ప్రమాదకర వ్యర్థం
- పెద్ద ఆసుపత్రులు మాత్రమే కాదు, చిన్న క్లినిక్‌లపైనా నిఘా అవసరం
- నోటీసులతో సరిపెడతారా? లేక తదుపరి చర్యలుంటాయా?

**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల ఆసుపత్రులు, క్లినిక్‌లలో బయోమెడికల్ వేస్ట్ నిర్వహణపై అధికారుల తనిఖీలు నిర్వహించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం నగరంలో గల వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలకు అనుగుణంగా బయోమెడికల్ వ్యర్థాలను వేరు చేయడం, నిల్వ చేయడం, అధికారికంగా ట్రీట్‌మెంట్, డిస్పోజల్‌కు తరలించడం వంటి అంశాల్లో లోపాలు గుర్తించిన నేపథ్యంలో పలు ఆసుపత్రులు, క్లినిక్‌లకు నోటీసులు జారీ చేసినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.ఖమ్మం నగరంలో వివిధ ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించిన అనంతరం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పలు ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లకు నోటీసులు జారీ చేసింది. బయోమెడికల్ వ్యర్థాల నియమావళి, 1998 మరియు ఎస్ఓ నెం. 630(ఇ) కింద ఈ నోటీసులు జారీ చేయబడ్డాయి.

**పసుపు, ఎరుపు, తెలుపు, నీలం కలర్ కోడింగ్ పాటిస్తున్నారా?**

బయోమెడికల్ వేస్ట్ అంటే సాధారణ చెత్త కాదు. ఆసుపత్రుల్లో చికిత్స అనంతరం బయటకు వచ్చే రక్తంతో తడిసిన డ్రెస్సింగ్ మెటీరియల్, శరీర భాగాలకు సంబంధించిన వ్యర్థాలు, ఉపయోగించిన సూదులు, సిరంజీలు, గ్లౌజులు, కొన్ని ప్లాస్టిక్ మెడికల్ వస్తువులు, ల్యాబొరేటరీ వ్యర్థాలు వంటి వాటికి ప్రత్యేక నిర్వహణ అవసరం. నిబంధనల ప్రకారం వ్యర్థాలను వాటి స్వభావానికి అనుగుణంగా వేర్వేరు కేటగిరీల్లో వేరు చేసి, నిర్దేశిత విధానంలో అధీకృత ట్రీట్‌మెంట్ సదుపాయాలకు తరలించాలి. కానీ తనిఖీల్లోనే నిబంధనల ఉల్లంఘనలు బయటపడితే, రోజువారీగా ఆసుపత్రుల నుంచి బయటకు వెళ్తున్న వ్యర్థాలపై పర్యవేక్షణ ఎంతవరకు జరుగుతోందన్న ప్రశ్న తలెత్తుతోంది.

**అసలు ఇన్వెస్టిగేషన్ ఇక్కడే మొదలు**

ఆసుపత్రి నుంచి బయోమెడికల్ వేస్ట్ బయటకు వెళ్లిన తర్వాత దాని గమ్యం ఏమిటి? ఏ సంస్థకు అప్పగిస్తున్నారు? ఆ సంస్థకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? వ్యర్థాలను తీసుకెళ్లిన తర్వాత వాటిని ఎక్కడ ట్రీట్ చేస్తున్నారు? ఎక్కడ డిస్పోజ్ చేస్తున్నారు? వాహనాల ద్వారా తరలింపునకు సంబంధించిన రికార్డులు ఉన్నాయా? ఆసుపత్రి రికార్డుల్లో చూపిస్తున్న పరిమాణం, వాస్తవంగా బయటకు వెళ్తున్న పరిమాణంతో సరిపోతుందా? ఇవన్నీ ఇప్పుడు అధికారుల తదుపరి దర్యాప్తులో కీలకంగా మారాల్సిన ప్రశ్నలు.

**--- "చెత్త" కాదు.. ప్రమాదకర వ్యర్థం**

బయోమెడికల్ వేస్ట్‌ను సాధారణ మున్సిపల్ చెత్తతో కలిపితే దాని ప్రభావం కేవలం పారిశుద్ధ్య సమస్యకే పరిమితం కాదు. సూదులు, రక్తంతో కలుషితమైన పదార్థాలు, ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన వ్యర్థాలు నిర్లక్ష్యంగా నిర్వహిస్తే పారిశుద్ధ్య కార్మికులు, వ్యర్థాల సేకరణ సిబ్బంది, రీసైక్లింగ్ కార్మికులు, పరిసర ప్రాంత ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుకే ఆసుపత్రుల లోపల వ్యర్థాలను వేరు చేయడం నుంచి తుది శుద్ధి, పారవేత వరకు మొత్తం చైన్‌పై పర్యవేక్షణ అవసరం.

**పలు ఆసుపత్రులకేనా??**

తాజా చర్య పలు ఆసుపత్రులు, క్లినిక్‌లతో ఆగిపోతుందా? లేక నగరంలోని మరిన్ని వైద్య సంస్థల్లోనూ ఇదే తరహా తనిఖీలు జరగనున్నాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. అంతేకాదు, ఇటీవల ఆసుపత్రులు, క్లినిక్‌లకు బయోమెడికల్ వేస్ట్ నిర్వహణలో లోపాలపై నోటీసులు ఇచ్చినట్లు మరో నివేదిక వెలువడింది. దీంతో నగరవ్యాప్తంగా బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై సమగ్ర ఆడిట్ అవసరమనే వాదన బలపడుతోంది.

**గతంలోనూ నోటీసులా? రికార్డులు బయటకు వస్తాయా?**

ఇప్పుడు అసలు ప్రశ్న, నోటీసులు అందుకున్న సంస్థల్లో గతంలోనూ ఇదే తరహా లోపాలు నమోదయ్యాయా? గతంలో తనిఖీలు జరిగాయా? జరిగితే అధికారులు ఏ చర్యలు తీసుకున్నారు? అప్పట్లో ఇచ్చిన ఆదేశాలు అమలయ్యాయా? మళ్లీ అదే లోపాలు ఎందుకు బయటపడ్డాయి? ఒకసారి నోటీసు ఇచ్చి ఫైల్ మూసేయడం కాకుండా, గత తనిఖీల నుంచి ఇప్పటి తనిఖీల వరకు పూర్తి కంప్లయెన్స్ హిస్టరీని బయటపెడితే అసలు సమస్య ఎక్కడుందో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**రికార్డులపై ఫోకస్, నెలవారీ వేస్ట్ లెక్కలు ఎక్కడ?**

ప్రతి ఆసుపత్రి నుంచి నెలకు సగటున ఎంత బయోమెడికల్ వేస్ట్ ఉత్పత్తి అవుతోంది? దానిలో పసుపు, ఎరుపు, తెలుపు, నీలం కేటగిరీల వారీగా ఎంత పరిమాణం ఉంది? ఎవరు సేకరిస్తున్నారు? ఎప్పుడు తీసుకెళ్తున్నారు? ఏ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీకి చేరుతోంది? దానికి సంబంధించిన వెయ్‌బ్రిడ్జ్/కలెక్షన్ రికార్డులు, మానిఫెస్టులు, నెలవారీ రిటర్నులు, ట్రీట్‌మెంట్ రికార్డులు ఉన్నాయా? ఇవన్నీ పరిశీలిస్తే కాగితాలపై ఉన్న లెక్కలు, నేలమీద ఉన్న వాస్తవాల మధ్య ఏమైనా తేడా ఉందా అన్నది తేలే అవకాశం ఉంటుంది.

**పెద్ద ఆసుపత్రులు మాత్రమే కాదు, చిన్న క్లినిక్‌లపైనా నిఘా అవసరం**

నగరంలో పెద్ద ఆసుపత్రులు మాత్రమే కాదు, చిన్న నర్సింగ్ హోమ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, డెంటల్ క్లినిక్‌లు, ల్యాబొరేటరీలు, డే కేర్ సెంటర్లు కూడా బయోమెడికల్ వేస్ట్ ఉత్పత్తి చేసే సంస్థలే. వీటన్నింటికీ ఒకే స్థాయిలో తనిఖీలు జరుగుతున్నాయా? అధీకృత ఏజెన్సీతో ఒప్పందం ఉందా? వ్యర్థాల సేకరణకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయా? చిన్న సంస్థలపై పర్యవేక్షణ లోపిస్తే అక్కడి నుంచి బయటకు వెళ్లే వ్యర్థాలు సాధారణ చెత్తలో కలిసే అవకాశం ఉందా? అనే అంశాలను కూడా అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**నోటీసులతో సరిపెడతారా? లేక తదుపరి చర్యలుంటాయా?**

తాజా నోటీసుల్లో అధికారులు వ్యర్థాలను ఉత్పత్తి అయిన ప్రదేశంలోనే వేరు చేయడం, నిర్దేశిత రంగుల కేటగిరీల్లో నిల్వ చేయడం, అధీకృత ట్రీట్‌మెంట్ సదుపాయాలకు అప్పగించడం వంటి నిబంధనలను పాటించాలని సూచించినట్లు నివేదికలు చెబుతున్నాయి. నిబంధనలు పదేపదే ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు కూడా ఉన్నట్లు సమాచారం.నోటీసులు అందుకున్న ఆయా సంస్థల్లో గతంలోనూ ఉల్లంఘనలు నమోదయ్యాయా?గత తనిఖీల్లో ఏం బయటపడింది?ఇప్పటివరకు ఎన్ని ఆసుపత్రులపై చర్యలు తీసుకున్నారు?బయోమెడికల్ వేస్ట్ సేకరించే అధీకృత సంస్థలు ఏవి?రోజువారీగా సేకరించిన వ్యర్థాల పరిమాణానికి పూర్తి రికార్డు ఉందా?ఆసుపత్రుల రికార్డులు, సేకరణ సంస్థల రికార్డులు సరిపోతున్నాయా?కలర్ కోడింగ్ నిబంధనలు వాస్తవంగా అమలవుతున్నాయా?బయోమెడికల్ వేస్ట్ సాధారణ చెత్తలోకి వెళ్లకుండా అధికారులు ఎలా నిర్ధారిస్తున్నారు?నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై కేవలం నోటీసులేనా.. లేక తదుపరి శిక్షాత్మక చర్యలూ ఉంటాయా?

**ఆసుపత్రి గోడల మధ్య మొదలై నగర ఆరోగ్యానికి చేరే సమస్య**

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగి ఆరోగ్యం కాపాడటం ఎంత ముఖ్యమో, చికిత్స అనంతరం వెలువడే ప్రమాదకర వ్యర్థాలను సురక్షితంగా నిర్వహించడం కూడా అంతే ముఖ్యం. ఖమ్మం నగరంలో ఒకవైపు పలు ఆసుపత్రులకు నోటీసులు, మరోవైపు ఆసుపత్రులు, క్లినిక్‌లపై బయోమెడికల్ వేస్ట్ నిర్వహణలో లోపాలపై నోటీసుల సమాచారం వెలుగులోకి రావడం సాధారణ తనిఖీ అంశంగా తీసుకోలేని పరిస్థితిని సూచిస్తోంది.నోటీసులు ఇచ్చినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. ఆ వ్యర్థం ఎక్కడ పుట్టింది? ఎవరు సేకరించారు? ఎక్కడికి తరలించారు? ఎలా ట్రీట్ చేశారు? చివరకు ఎక్కడ డిస్పోజ్ చేశారు? ఈ మొత్తం ప్రయాణానికి సమాధానం దొరికినప్పుడే ఖమ్మంలో బయోమెడికల్ వేస్ట్ నిర్వహణపై అసలు చిత్రం బయటపడుతుంది."మెడికల్ వేస్ట్‌కు గమ్యం ఉందా? లేక నగరమే దాని గమ్యస్థానమా?" ఇప్పుడు ఖమ్మం అధికార యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన ప్రశ్న ఇదే.

# యస్.బి.ఐ.టి. లో ముగిసిన అంతర్గత స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** విద్యార్థుల ఆలోచనలనుంచి ఆవిష్కరణ వరకు ప్రతిభను వెలికితీసే గొప్ప వేదిక స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (యస్.ఐ.హెచ్) అని ఎస్.బి. ఐ.టి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అంతర్గత యస్.ఐ.హెచ్ – 26 పోటీలలో ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్ధులనుద్దేశించి ప్రసంగిస్తూ దేశ వ్యాప్తంగా విద్యార్ధుల లోని సృజనాత్మకత, ఆవిష్కరణలు, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం విద్యార్థులు దేశంలోని వివిధ రంగాలకు సంబందించి వాస్తవిక సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వినూత్న పరిష్కారాలను రూపొందించే జాతీయ స్థాయి కార్యక్రమం అని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. అంతర్గత యస్.ఐ.హెచ్ లో భాగంగా తమ కళాశాలలోని 78 జట్లు పాల్గొనగా 48 జట్లను ఎంపికచేసి జాతీయ స్థాయి పోటీలకు పంపినట్లు తెలిపారు. భారతదేశపు విద్యామంత్రిత్వశాఖ, ఎ.ఐ.సి.టి.ఈ., ఐ.ఐ.సి. సంయుక్తంగా నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు బృంధాలుగా పనిచేస్తూ సమస్య గుర్తించి, పరిశోధన చేసి ప్రోటోటైప్, కోడింగ్, టెస్టింగ్ ద్వారా పరిష్కార మార్గాలను అన్వేషించి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడం వారి సృజనాత్మకతకు పరీక్ష అని కళాశాల వైస్–చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. డిసెంబరులో జరుగబోయే జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ – 2026 గ్రాండ్ ఫినాలే విజేతలకు 1.50 లక్షల బహుమానంతో పాటు సర్టిఫికెట్లు అందిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ తెలిపారు. సైబర్ నేరాలను అరికట్టడంలో భాగంగా ట్రూఓక్స్, ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఎ.ఐ. ఆధారిత స్పెక్ట్రాయక్స్, బయోటెక్ అనుబంధిత ఇన్‌విక్టస్ వంటి వివిధ సామాజిక సమస్యలకు తమ కళాశాల విద్యార్థులు ఆచరణ రూపం దాల్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, కళాశాల ఇన్నోవేషన్ సెల్ ఇంఛార్జ్ పి. అశ్విని, జి. ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# పోలాల అమావాస్య సందర్భంగా గో దాణా వితరణ కార్యక్రమం



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** శ్రీ స్థంభాద్రి సేవా సమితి వారి ఆధ్వర్యంలో శ్రావణ మాసంలో వచ్చే యీ విశేష పోలాల అమావాస్య తిథి సందర్భంగా స్థానిక నగర పెద్దలు, దాల్ మిల్ యజమానులు, ఛాంబర్ వ్యాపారులు, రుక్మిణి సిల్క్స్ యాజమాన్యం, గోభక్తులు, మిత్రులు, సేవా సమితి సభ్యుల సహకారముతో రూ.77,000/–ల విలువ కలిగిన తవుడు, గో దాణాకు సంబందించిన చున్నీ, బెల్లం, పచ్చిగడ్డి, కూరగాయలు, ఆకుకూరలను గొల్లగూడెం ఓం శ్రీకృష్ణ గోశాల వారికి రూ 60,000/– , టేకులపల్లి గోశాలకు రూ.13,500/–, 3వ పట్టణములోని వివిధ గోశాలల వారికి రూ.3,500/–ల పచ్చిగడ్డిని దాతల పక్షనా వితరణ చేశారు. ఈ విశేషమైన పోలాల అమావాస్య నాడు గో దాణా కు ధన – వస్తు రూపేణా సహకరించిన యావన్మంది దాతలకు, వారి కుటుంబ సభ్యులకు నడిచే ప్రత్యక్ష దైవం అయిన శ్రీగోమాతల అనుగ్రహం, ఆశిస్సులు కలుగవలెనని ఆయా గోశాలల యజమాన్యముల గోపూజలు చేసి కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలియచేశారు. ఈ గో సేవా కార్యక్రమం లో కన్వీనర్ తూములూరి లక్ష్మీ నరసింహారావు, పెద్దలు దేవిశెట్టి శ్రీరాములు, సభ్యులు వంగవీటి నవీన్, సుంకర ఎల్లారావు, కందిబండ రమేష్, మిట్టపల్లి ప్రభాకర్ రావు, కారంశెట్టి నాగేశ్వరావు, మోతుకూరి భద్రయ్య, రాయపూడి రవి, మలిశెట్టి పాండు, మోత్కూరి రవి, పందిరి నాగేశ్వరావు, పసుమర్తి లోహిత్, దాల్ యజమానులు గ్రందే రమణ, సురేష్ ల కుటుంబ సభ్యులు, కుమ్మరికుంట్ల మురళీ, వి శ్రీనివాస్, మలిశెట్టి లక్షణ్ బాబు లతో పాటు దాతలు, ఆయా గోశాలల భాద్యులు శ్రీమాన్ ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, ఓం నారాయణ , కేసా హనుమంతరావు , చైన్సింగ్ లు తదితరులు గోసేవలో పాల్గోన్నారు.

# సాగునీరు, కరెంటు కష్టాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరం

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- సాగునీరు, విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- తక్షణమే సాగునీరు, విద్యుత్ అందించాలి : పువ్వాడ
- ముందే తెలిసిన ఎల్‌నినో ముప్పుపై ప్రణాళికేదీ? కాంగ్రెస్ నిర్లక్ష్యంతో రైతుల అవస్థలు : పువ్వాడ




**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీరు, విద్యుత్ కష్టాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు అవసరమైన సాగునీరు, విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఎల్ నినో ప్రభావం ఉంటుందని ముందుగానే తెలిసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం వల్ల ప్రస్తుతం పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ పాలన కారణంగా పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, రైతులు భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులకు తక్షణమే అవసరమైన సాగునీరు, విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి అత్యవసర ప్రాతిపదికన సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ వైద్యానికి కొత్త బలం, ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల విస్తరణ

- కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక పర్యవేక్షణ తో ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం---
- మంత్రుల ప్రత్యేక శ్రద్ధతో సౌకర్యాల విస్తరణ, ప్రజలకు మరింత చేరువైన నాణ్యమైన వైద్యం---
- త్వరలో ఎంఆర్ఐ సేవలు, ఇప్పటికే అందుబాటులోకి మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు---
- రోగిని కదిలించాల్సిన అవసరం లేకుండా పడక వద్దే ఎక్స్‌రే---
- కలర్ డాప్లర్, కాంట్రాస్ట్ సీటీ, హెచ్ఆర్ సీటీతో అధునాతన నిర్ధారణ సేవలు---
- మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 16,961 స్కాన్లు, 546 టిఫ్ఫా స్కాన్లతో గర్భిణులకు ప్రత్యేక భరోసా---
- రేడియాలజీ సేవలకు నిపుణుల బలం, ఖాళీల భర్తీకి చర్యలు







**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :**
ప్రభుత్వ ఆసుపత్రి అంటే సాధారణ వైద్యం మాత్రమే అనే భావనను మార్చేలా ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య సేవలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఆధునిక వైద్య పరీక్షలు, అధునాతన స్కానింగ్ సదుపాయాలు, రేడియాలజీ సేవలు, మాతా శిశు సంరక్షణ, అత్యవసర రోగులకు పడక వద్దే పరీక్షలు వంటి అనేక సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువవుతోంది. ఖరీదైన పరీక్షల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే అనేక ఆధునిక సేవలు అందుతున్నాయి.జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆసుపత్రిలోని అవసరాలను గుర్తించడం, వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకు రావడం, వాటికి అవసరమైన మౌళిక వసతులు కల్పించడం, వైద్య నిపుణుల కొరతను అధిగమించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల విస్తరణకు రాష్ట్ర మంత్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల బలోపేతానికి మరింత ఊతం లభిస్తోంది.--- మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకిఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి కొత్తగా 3 పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అవసరమైన రోగులకు వేగంగా అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిని బట్టి పరీక్షలు నిర్వహించేందుకు ఈ పోర్టబుల్ యంత్రాలు ఎంతోఉపయోగపడుతున్నాయి.అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి తరలించాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, వైద్యుల సూచన మేరకు అవసరమైన ప్రదేశంలోనే పరీక్ష నిర్వహించే వెసులుబాటు ఏర్పడుతోంది.--- త్వరలో ఎంఆర్ఐ, కలెక్టర్ చొరవతో సివిల్ పనులు వేగవంతంఖమ్మం సర్వజనాసుపత్రిలో త్వరలో ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రానుంది. ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవతో వేగంగా పూర్తి చేస్తున్నారు. ఎంఆర్ఐ యంత్రానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యంత్రం ఏర్పాటు చేసిన తర్వాత అది నిరంతరాయంగా ప్రజలకు సేవలందించేలా అవసరమైన మౌళిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేస్తున్నారు.మెదడు, వెన్నెముక, కీళ్లు, కండరాలు, అంతర్గత అవయవాలు, తదితర ప్రాంతాలకు సంబంధించిన అనేక సమస్యలను గుర్తించడంలో ఎంఆర్ఐ పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవ అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు అధిక వ్యయంతో కూడిన ప్రైవేటు పరీక్షల భారం తగ్గనుంది.--- పడక వద్దే ఎక్స్‌రే, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి ఉపశమనం సర్వజనాసుపత్రిలో పోర్టబుల్ ఎక్స్‌రే, స్థిర ఎక్స్‌రే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఓపీ, ఐపీ రోగులకు అవసరాన్ని బట్టి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం అందుబాటులో ఉండటం వల్ల కదలలేని రోగులను పడక నుంచి ఎక్స్‌రే విభాగానికి తీసుకెళ్లాల్సిన అవసరం తగ్గింది. రోగిని పడకపైనే ఉంచి అవసరమైన సమయంలో అక్కడికక్కడే ఎక్స్‌రే తీసే సదుపాయం ఏర్పడింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, అత్యవసర చికిత్స పొందుతున్నవారు, కదలడానికి ఇబ్బంది ఉన్న రోగులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా మారింది. రోగిని తరలించే సమయంలో కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంతో పాటు వైద్యులకు త్వరగా పరీక్షా ఫలితాలు అందే అవకాశం ఏర్పడింది. అదనంగా ఓపీ, ఐపీ సేవలకు ఎక్స్‌రే యంత్రాలను వినియోగిస్తున్నారు. టీ-హబ్‌లో అదనపు ఎక్స్‌రే యంత్రంతో పాటు మామోగ్రఫీ, స్కానింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు.--- జనవరి, ఆగస్టులో 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అల్ట్రాసౌండ్ సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించారు.జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, అత్యవసర తదితర విభాగాలకు వచ్చే రోగులకు అవసరాన్ని బట్టి అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జూలైలో 1,977, ఆగస్టులో 1,943 స్కాన్లు నిర్వహించడం ద్వారా సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్న విషయం స్పష్టమవుతోంది.--- మాతా శిశు సంరక్షణలో 16,961 స్కాన్లు గర్భిణీలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు ఖమ్మం మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 16,961 స్కాన్లు నిర్వహించారు. వీటిలో 8,945 ఓబీజీ స్కాన్లు , 5,417 ఉదర భాగం స్కాన్లు , 546 టిఫ్ఫా స్కాన్లు, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి.నెలవారీగా పరిశీలిస్తే ఓబీజీ స్కాన్లు జనవరిలో 910 నుంచి ఆగస్టులో 1,329కు పెరిగాయి. ఉదర భాగం స్కాన్లు జనవరిలో 455 ఉండగా జూలైలో 999కు చేరాయి. చిన్నారులకు నిర్వహించిన స్కాన్లు ఆగస్టులో 388కు చేరాయి. ఇది మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పరీక్షా సేవల వినియోగం పెరుగుతున్నదానికి నిదర్శనంగా నిలుస్తోంది.--- గర్భంలోని శిశువు ఆరోగ్యం ముందుగానే తెలుసుకునే అవకాశం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణీల కోసం ప్రత్యేకంగా టిఫ్ఫా స్కాన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గర్భధారణలో సాధారణంగా ఐదు నుంచి ఆరో నెల మధ్య నిర్వహించే ఈ పరీక్ష ద్వారా గర్భంలోని శిశువు అవయవాల నిర్మాణం, అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితిని ముందుగానే పరిశీలించే అవకాశం ఉంటుంది. పిండంలో అవయవ లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ముందుగానే వైద్య ప్రణాళిక రూపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది.ప్రైవేటు వైద్య కేంద్రాల్లో సాధారణంగా సుమారు రూ. 6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చయ్యే ఈ తరహా సేవను ప్రభుత్వ వైద్య వ్యవస్థలో ఉచితంగా అందించడం గర్భిణీలకు ఎంతో ప్రయోజనకరం. టిఫ్ఫా స్కాన్ల సంఖ్యలోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఫిబ్రవరిలో 19 గా ఉన్న స్కాన్లు , ఆగస్టులో 136కు చేరాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 546 టిఫ్ఫా స్కాన్లు నిర్వహించారు.--- కలర్ డాప్లర్‌తో రక్తనాళాల సమస్యలకు ముందస్తు గుర్తింపుసర్వజనాసుపత్రిలో కలర్ డాప్లర్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. రక్త నాళాల్లో రక్తప్రసరణను పరిశీలించడం, రక్త నాళాల్లో ఏర్పడే అడ్డంకులను గుర్తించడం వంటి వాటికి ఈ పరీక్ష ఉపయోగపడు తుంది. రక్తనాళాల్లో కొవ్వు నిల్వలు లేదా ఇతర కారణాలతో ఏర్పడే అడ్డంకులను గుర్తించేందుకు కలర్ డాప్లర్ సహాయపడు తుంది. డీప్ వీన్ థ్రాంబోసిస్, సిరలకు సంబంధించిన సమస్యలు, ధమనుల్లో రక్తం గడ్డకట్టడం వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది.సకాలంలో వ్యాధిని గుర్తించి అవసరమైన వైద్య చికిత్స లేదా శస్త్రచికిత్స అందించడం ద్వారా చేతులు, కాళ్లకు కలిగే నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుంది.ప్రైవేటు వైద్య కేంద్రాల్లో ఒక్కో పరీక్షకు సుమారు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు ఖర్చయ్యే సేవను ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతోంది.--- కాంట్రాస్ట్ సీటీ.. హెచ్ఆర్ సీటీ సేవలు సర్వజనాసుపత్రిలో కాంట్రాస్ట్ సీటీ స్కాన్ సేవలు నిరంతరాయంగా అందిస్తున్నారు. పగలు, రాత్రి మూడు షిఫ్టుల్లో సేవలు కొనసాగిస్తూ అవసరమైన రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కణతులు, వివిధ అవయవాల స్థితిగతులు, ప్రమాదాల్లో గాయాల తీవ్రత వంటి అంశాలను తెలుసుకోవడంలో సీటీ స్కాన్ కీలకంగా ఉంటుంది. హెచ్ఆర్ సీటీ స్కాన్ ద్వారా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులను స్పష్టంగా గుర్తించే అవకాశం ఉంటుంది.మెదడు సంబంధిత వ్యాధులు, పక్షవాతం, మెదడు కణుతులు, ప్రమాదాల్లో గాయాలు తదితర సమస్యలను గుర్తించడంలో కూడా సీటీ స్కాన్ సేవలు ఉపయోగపడు తున్నాయి. ఈ సేవలు ప్రభుత్వ ఆసుపత్రి లోనే అందుబాటులో ఉండటం వల్ల రోగులు బయటకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతోంది.--- రేడియాలజీ సేవలకు నిపుణుల బలం గతంలో రేడియాలజిస్టుల కొరత కారణంగా రేడియాలజీ సేవల నిర్వహణలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యేవి. సమస్య తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవ తీసుకుని రేడియాలజీ సేవలను బలోపేతం చేసే చర్యలు చేపట్టారు. ఇటీవల డాక్టర్ సురేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. దీంతో రేడియాలజీ విభాగానికి మరింత నిపుణుల బలం చేకూరింది.అదే విధంగా అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా, పరిధిలోని వైద్య నిపుణుడు డాక్టర్ మురళీకృష్ణను సర్వజనాసుపత్రికి కేటాయించేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఫలితంగా రేడియాలజీ సేవలు మరింత పటిష్టమై ప్రజలకు నాణ్యమైన నిర్ధారణ సేవలు అందించే అవకాశం ఏర్పడింది.--- వైద్య సిబ్బంది ఖాళీల భర్తీకి చర్యలు ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన మానవ వనరులపై కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసేలా చర్యలు చేపట్టారు. వైద్య పరికరాలు అందుబాటులో ఉండటంతో పాటు వాటిని సమర్థవంతంగా వినియోగించేందుకు అవసరమైన వైద్య నిపుణుల సేవలు కూడా అందుబాటులోకి రావడం ద్వారా ఆసుపత్రి వైద్య సామర్థ్యం మరింత పెరుగుతోంది.--- పరికరం రావడమే కాదు, నిరంతర సేవలు అందించడమే లక్ష్యం కొత్త వైద్య పరికరాలు అందుబాటులోకి రావడం ఒక దశ మాత్రమే. వాటిని ప్రజలకు నిరంతరం ఉపయోగపడేలా చేయడం మరింత ముఖ్యమైన అంశం. ఈ దిశగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.యంత్రాల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులు, విద్యుత్ సదుపాయాలు, వైద్య నిపుణుల అందుబాటు, సిబ్బంది ఖాళీల భర్తీ వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో ఆసుపత్రిలో వైద్య పరికరాలు అందుబాటు లో ఉండటమే కాకుండా వాటి ద్వారా ప్రజలకు నిరంతర సేవలు అందే పరిస్థితి ఏర్పడుతున్నది.--- పేదలకు ఆర్థిక భారం తగ్గిస్తూ, నాణ్యమైన వైద్యం అత్యాధునిక పరీక్షలు అందుబాటులోకి రావడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఆర్థిక భరోసా లభిస్తోంది. అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్, సీటీ స్కాన్, హెచ్ఆర్ సీటీ, మామోగ్రఫీ, టిఫ్ఫా వంటి అనేక సేవలు అందుబాటులో ఉండటంతో ఖరీదైన ప్రైవేటు పరీక్షా కేంద్రాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతోంది. గర్భిణీల నుంచి చిన్నారుల వరకు, సాధారణ రోగుల నుంచి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి వరకు వివిధ వర్గాలకు అవసరమైన వైద్య సేవలను ఒకే ప్రభుత్వ వైద్య వ్యవస్థలో అందించే దిశగా ఆసుపత్రి ముందుకు సాగుతోంది.--- ప్రజల్లో పెరుగుతున్న నమ్మకంఆసుపత్రిలో అందుబాటులోకి వస్తున్న కొత్త సేవలను ప్రజలు క్రమంగా వినియోగించుకుంటున్నారు. జనవరి నుంచి ఆగస్టు వరకు అల్ట్రాసౌండ్ సేవల్లో నమోదైన 13,816 పరీక్షలు, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహించిన 16,961 స్కాన్లు దీనికి నిదర్శనం.అత్యాధునిక పరీక్షా సదుపాయాలు, వైద్య నిపుణుల సేవలు, నిరంతర రేడియాలజీ సేవలు, అత్యవసర రోగులకు పడక వద్దే ఎక్స్‌రే వంటి సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతోంది.--- ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు, ప్రభుత్వ సేవలను వినియోగించుకోండి ఆరోగ్య సమస్యలు తీవ్రతరం అయ్యే వరకు వేచి చూడకుండా అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించు కోవడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. వైద్యుల సూచన మేరకు అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్, సీటీ స్కాన్, హెచ్ఆర్ సీటీ, మామోగ్రఫీ వంటి పరీక్షలను వినియోగించుకోవాలి.గర్భిణీలు మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అందుబాటులో ఉన్న ఓబీజీ, టిఫ్ఫా, ఇతర స్కానింగ్ సేవలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి. శిశువు ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకుని అవసరమైన వైద్య ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని మరింతగా కాపాడుకోవచ్చు.--- ప్రభుత్వ ఆసుపత్రి, ప్రజల ఆరోగ్యానికి భరోసా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య సదుపాయాలు విస్తరిస్తున్నాయి. కొత్త పరికరాలు, అధునాతన పరీక్షలు, నిపుణుల సేవలు, మాతా శిశు సంరక్షణ, అత్యవసర సేవలు ఇలా ప్రతి విభాగంలోనూ సామర్థ్యాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి.ప్రజలు ఈ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ ఆసుపత్రి మీ ఆరోగ్యానికి అందుబాటులో ఉంది.. ఆధునిక వైద్య సేవలు మీ కోసం అందుతున్నాయి.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

# జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో సర్వజ్ఞ విద్యార్థినికి ద్వితీయ స్థానం




**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** తపస్వి స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో సర్వజ్ఞ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని గుత్తికొండ మాన్వి అద్భుత ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన నృత్య కళాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో మాన్వి తన నృత్య ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని జాతీయ స్థాయిలో రెండవ స్థానాన్ని సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. చిన్న వయసులోనే కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్య కళలో ప్రతిభను కనబరుస్తూ, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మాన్వి ప్రతిభకు నిదర్శనమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ సందర్భంగా చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ నీలిమా లు మాన్విని ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి పోటీలో ద్వితీయ స్థానం సాధించడం పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వకారణమని వారు తెలిపారు.విద్యార్థులలో కేవలం విద్యాపరమైన ప్రతిభను మాత్రమే కాకుండా, కళలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ వారి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి సర్వజ్ఞ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని వారు తెలిపారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, సరైన శిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగడానికి పాఠశాల యాజమాన్యం ఎల్లప్పుడూ ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.మాన్వి సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకమని, క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో ముందుకు సాగితే ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వారు అన్నారు.మాన్వి భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆకాంక్షిస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యం

- కలెక్టర్ చోరవ తో రూ.1.80 లక్షలు మంజూరు
  : జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి రాజశేఖర్ గౌడ్



**ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్.కె. రాజశేఖర్ గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హస్పిటల్ ను శుక్రవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఓపీ రోగుల వద్ద కు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల స్టాక్ ను పరిశీలించారు. వైద్యాధికారులు. సిబ్బందితో ప్రత్యేక సమావేశం ను | నిర్వహించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు... ప్రభుత్వ హస్పిటల్స్ లో కార్పోరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు –నేలకొండ పల్లి సీహెచ్సీ కి రోగుల సంఖ్య ఎక్కువగా వస్తున్న విషయం' ను. అవసరమైన మందులు గురించి జిల్లా కలెక్టర్ దృపికి తీసు కెళ్లినట్లు. తెలిపారు. స్పందించిన కలెక్టర్ ప్రత్యేక చోరవతో రూ.1.80 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. నేలకొండ పల్లి సీహెచ్సీ 50 పడకల ఆసుపత్రిగా ఆప్ గ్రేడ్ గా చేసే ప్రతిపాధనలు ప్రభుత్వం వద్ద కు చేరిందన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చోరవతో త్వరగా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్.మంగళ, డాక్టర్.కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులకు రక్షణ కరువు : ఎంపీ వద్దిరాజు ఎమ్మెల్యేలు గుంటకండ్ల, పల్లా



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** తెలంగాణలో ప్రజలకే కాదు ప్రజా ప్రతినిధులకు కూడా రక్షణ కరువైందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రధాన ప్రతిపక్షాన్ని ఇబ్బందులు పెడుతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన చెందారు.కాంగ్రెస్ సర్కార్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో రేవంత్ రెడ్డి దిక్కుతోచక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాష్టీకానికి ఒడిగట్టారని మండిపడ్డారు. ఎంపీ రవిచంద్ర ఢిల్లీ తెలంగాణ భవన్ లో శుక్రవారం ఎమ్మెల్యేలు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు వారు రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్ రావు,ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,ప్రముఖ న్యాయవాది సోమ భరత్ కుమార్ తదితరులతో పాటు జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహత్కర్, మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతిలను కలిసి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రోద్భలంతో పోలీసులు వ్యవహరించిన అనుచిత వైఖరిని వివరించారు.ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజు సుమారు 500 మంది పోలీసులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై దాడికి పాల్పడ్డారన్నారు.మగ పోలీసులు మహిళా ప్రజాప్రతినిధుల చుట్టూ చేరి,ఆడ పోలీసులు పురుష ప్రజాప్రతినిధులను అసెంబ్లీలోకి వెళ్లనివ్వ కుండా అడ్డుకుని దౌర్జన్యం చేశారన్నారు.ఎమ్మెల్సీ తాతా మధు ప్యాంట్ లాగి చెప్పకూడని చోట కొట్టడంతో తట్టుకోలేక అరిచితే ఆయన అనని మాటలను ఆపాదించారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.అయినప్పటికీ ఆయన పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశానుసారం తన మాటలను ఉపసంహరించుకుని విచారం ప్రకటించారన్నారు.కొత్తగూడెంలో కాంగ్రెస్ కార్యకర్తలు మధు దిష్టిబొమ్మకు పాడే కట్టి ద్వేషం వెళ్లకక్కడం బాధాకరమని ఎంపీ వద్దిరాజు అన్నారు.ఎమ్మెల్సీలు మధు, నవీన్ కుమార్ రెడ్డిలను పోలీసులు దొంగలు, నేరస్తుల మాదిరిగా అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించాలనే కుట్రను న్యాయస్థానం తిరస్కరించిందని, అసెంబ్లీ వద్ద పోలీసుల ఓవరాక్షన్ ను హైకోర్టు తప్పుబట్టిందని ఆయన చెప్పారు.కాంగ్రెస్ అధి నాయకుడు రాహూల్ గాంధీతో పాటు ఆ పార్టీ ఎంపీలు నల్ల టీషర్టులు,చొక్కాలు ధరించి ఓ పక్క ప్రధాని నరేంద్రమోడీ,మరో వైపు పారిశ్రామిక వేత్త అదానీ బొమ్మలతో పార్లమెంటులో అడుగుపెట్టిన సందర్భాలను ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.రాజ్యాంగ ప్రతిని నిత్యం చేతపట్టుకు తిరిగే రాహూల్ గాంధీకి తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక,అప్రజాస్వామిక విధానాలు కనబడకపోవడం శోచనీయమన్నారు.కాంగ్రెస్ పార్టీకి పార్లమెంటులో ఒక విధానం,తమ పాలనలోని రాష్ట్రాలలో మరొక విధానం ఉంటుందా?అని ఎంపీ రవిచంద్ర నిలదీశారు.ప్రతిపక్ష నాయకులు కేసీఆర్ సభకు రావాలని కోరే అధికార పక్షం అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసి బయటకు పంపడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడిగే ప్రశ్నలకు,లేవనెత్తే అంశాలకు సమాధానాలు చెప్పలేకే అసెంబ్లీ నుంచి వారిని బయటకు పంపడం జరిగిందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ప్రతి నిత్యం ప్రజల న్యాయమైన హక్కుల సాధనకు పోరాడుతున్న ప్రధాన ప్రతిపక్షం నోరు నొక్కాలని,అసెంబ్లీలోకి రాకుండా పాలకులు ఎన్ని కుట్రలు పన్నినా, నిర్బంధాలు ప్రయోగించినా తాము వెనుకాడబోమని స్పష్టం చేశారు.మీడియా,సోషల్ మీడియాల ద్వారా ఎప్పటికప్పుడు సర్కార్ తప్పుడు విధానాలను ఎండగడుతుంటామని,బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ నేత హరీష్ రావు 22ఎ ద్వారా ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి పాల్పడుతున్న భూఆక్రమణల గురించి వివరించారని ఎంపీ వద్దిరాజు తెలిపారు.

# మితిమీరుతున్న హిజ్రాల ఆగడాలు



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** కొందరికి హిజ్రాల ప్రవర్తన వల్ల మొత్తం వారి సమాజం పైనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. శుభకార్యాలలో వేడుకలలో ఇష్టానుసారంగా డబ్బులు డిమాండ్ చేయటం కార్యక్రమాలు సజావుగా కాకుండా అల్లర్లు చేయటం కొందరు హిజ్రాల తీరు ఇదే. దీని మూలంగా సజావుగా మంచిగా వసూలు చేసే హిజ్రాలు డిమాండ్ చేయకుండా ఇచ్చినవి తీసుకుని మంచి మనసున్న హిజ్రాలకు అవమానాలు ఎదురవుతున్నాయి . హైదరాబాద్ సి. పి. సివి ఆనంద్ హిజ్రాలపై హెచ్చరికలు జారీ చేయడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నాయి. సజావుగా వసూలు చేసే వారికి ఎటువంటి ఆటంకం ఉండదు. కానీ డిమాండ్ చేసి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ పాఠం కలిగిస్తున్న వారిపైనే ఎటువంటి ప్రభావం చూపుతుంది. తెలుగు రాష్ట్రాలలో ఇటువంటి సంస్కృతి ఎక్కువగా ఉంది కొన్ని చోట్ల ఇంటి యజమానులపై డబ్బులు ఇవ్వలేదని డాడి చేయడం రక్తం వచ్చే విధంగా దాడి చేసిన సంఘటన గతంలో వెలుగు చూసింది. హిజ్రాల పట్ల సిపి ఆనం చేసిన ప్రకటన వల్ల ప్రతి జిల్లాలో హిజ్రాల ఆగడాలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని జిల్లాలలోని పోలీసు అధికారులు ఆయా ప్రదేశాలలోని హిజ్రాల నాయకులను పిలిచి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు అరెస్టులు తప్పవని చెప్పారు. చదువుకున్న హిజ్రాలకు ఉద్యోగాలలో అవకాశాలు వస్తున్నాయని కొందరు పోలీస్ కానిస్టేబుళ్లు కొందరు డాక్టర్లు ఉంటూ సమాజానికి సేవ చేస్తున్నారని ఆ బాటలోనే మీరు నడవాలని. మితిమీరిన వసూలు చేయకూడదని సక్రమ పద్ధతిలో వసూలు చేసుకుంటే మంచిదని సూచించడం జరిగింది. ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే మన దగ్గరే ఎటువంటి ఆగడాలు నడుస్తున్నాయి తెలుస్తుంది. హిజ్రాల నాయకులు అసంఘికంగా పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజల నుండి విజ్ఞాపనలు వస్తున్నాయి. రైళ్లలో సైతం హిజ్రాల హింస ప్రయాణికులు తప్పట్లేదు. ఇదీ నిజాయితీ హిజ్రాల కు ఇబ్బంది ఏర్పడుతుంది. నాయకులు పోనుకొని అటువంటి చర్యలు తీసుకోవాలి. కొందరు ఇచ్చిన దాంతో వారి దీవెన లు అందుకుంటున్నారు. కొందరు శుభకార్యాలకు హిజ్రాలను ప్రత్యేకంగా పిలిచి వారి దీవెనలు తీసుకొని తగు రీతిలో వారికి కానుకలు ఇస్తున్నారు. హిజ్రాల శాపనార్థాలు మంచివి కావని వారితో ఘర్షణలు ఎందుకని అడిగిన తడవుగాని కొందరు డబ్బులిస్తున్నారు. ఇది సాకుగా తీసుకొని కొందరు డబ్బులు దండుకుని ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల నుండి ప్రజల నుండి విజ్ఞప్తులు అధికంగా రావటంతో పోలీస్ శాఖ వారు కఠిన చర్యలకు ఉపాక్రమించారు. కొన్ని ఇతరరాష్ట్రాలలో ఇటువంటి పరిస్థితి లేదూ.ఏది ఏమయినా పోలీస్ చర్యలకు. పబ్లిక్ నుండి ప్రశంసలు వెళువేతుతున్నాయి.

## భరతనాట్యంలో సత్తా చాటిన రెజొనెన్స్ విద్యార్థులు




**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ జాతీయస్థాయి భరతనాట్య పోటీల్లో ఖమ్మం వి.డి.ఓ.స్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో రెజొనెన్స్ పాఠశాల విద్యార్థులు తమ నృత్య ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందారు.పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న బి. ఆరాధ్య, రెండో తరగతి చదువుతున్న డి. గీతిక భరతనాట్య పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారు. చిన్న వయసులోనే జాతీయస్థాయి వేదికపై ప్రతిభను చాటుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.చిన్న వయసులోనే ప్రతిభకు గుర్తింపు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం అందిస్తున్న ప్రోత్సాహం ఫలితంగానే విద్యార్థులు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. చదువుతో పాటు సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సృజనాత్మకత పెరుగుతాయని తెలిపారు.బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఆర్.వి. నాగేంద్రకుమార్, నీలిమా తదితరులు అభినందించి సత్కరించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో రాణించాలి విద్యార్థులు చదువులోనే కాకుండా కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర సృజనాత్మక రంగాల్లోనూ ప్రతిభను చాటుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ టి. గోపాల్ కృష్ణ, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు.జాతీయస్థాయి పోటీల్లో ఖమ్మం చిన్నారులు సత్తా చాటడం పట్ల పాఠశాల వర్గాల్లో ఆనందం వ్యక్తమైంది. విద్యార్థుల విజయంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

# కమ్యూనిస్టుల పోరాటంతోనే నిజాం పాలన అంతం

- పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం
- సాయుధ పోరాట వారోత్సవాల్లో సిపిఐ నేత బాగం




**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ**;కమ్యూనిస్టుల పోరాటాలతోనే నిజాం రక్కసి పాలన అంతమైందని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లేకుంటే భారతదేశపు నడిబొడ్డున ఇప్పటికీ నిజాం రాజ్యం కొనసాగుతూనే ఉండేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే సువర్ణక్షరాలతో లిఖించదగిన ఈ మహోత్తర పోరాటంలో నాలుగువేల మంది అమరులయ్యారని అనేక గ్రామాలు విముక్తి చేయబడ్డాయని, దొరలు, జమీందార్ల పాలన అంతమైందని ఆయన తెలిపారు. -తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను శుక్రవారం ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహం వద్ద ప్రారంభించారు. పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పూలమాల వేయగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ సాయుధ పోరాటం ఒక చారిత్రిక ఘట్టమన్నారు. తెలంగాణలో మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలన నిర్బంధాలు, వేధింపులు మధ్య సాగేదని ఎవరికి స్వేచ్ఛ లేదని నిజాం సైన్యాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దొరలు, భూస్వాములు ప్రజల చేత వెట్టి చాకిరి చేయించుకునే వారని భూమి మొత్తం వారి చేతుల్లోనే కేంద్రీకృతమైందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో 11 సెప్టెంబర్ 1947న రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం -మోహినుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. సాయుధ పోరాటంలో సామాన్యులు సాయుధులై పోరాడారని మూడువేల గ్రామాలు భూస్వాముల చెర నుండి విముక్తి చేయబడ్డాయన్నారు. సాయుధ పోరాటం ద్వారా తెలంగాణలో భూమి పేదల పరంమైందని హేమంతరావు తెలిపారు. సాయుధ పోరాటం కేవలం నిజాం అంతానికి కాకుండా తెలంగాణలో ఒక నూతన సంస్కృతి, సాంప్రదాయానికి తెర లేపిందని ప్రజలు స్వేచ్ఛావాయువులను పీల్చారన్నారు. భూమి, భుక్తి, విముక్తి నినాదంగా సాగిన ఈ సాయుధ పోరాటంలో అనేక మంది అమరులయ్యారని వారి త్యాగాలు అజరామరమన్నారు. ఇప్పుడు -దేశంలో అప్రకటిత నిర్బంధం కొనసాగుతుందని ప్రశ్నించే వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని హేమంతరావు -ఆరోపించారు. పేరుకు ప్రజాస్వామ్యం అమలులో ఉన్న నిర్ణయాలు అప్రజాస్వామికంగా ఉంటున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ తప్పిదాలపై ప్రశ్నిస్తే దిమాగి నక్సల్స్ గా ముద్ర వేసి నిర్బంధించే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఒక పక్క మతతత్వం పెరుగుతుండగా మరో పక్క ఆర్థిక అంతరాలు పెరిగి ఈ దేశంలో సంపద పోగుపడుతుందన్నారు. సమాజ రక్షణకు బడుగు, -బలహీన వర్గాలకు అండగా పోరాటాలు సాగించేందుకు సాయుధ పోరాట చరిత్ర దోహదపడాలన్నారు. అనాటి అమరుల "త్యాగాలను స్మరించుకుని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సాయుధ పోరాట వారోత్సవాలు నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహలక్ష్మి , తోట రామాంజనేయులు, కూచిపూడి రవి, ఏనుగు గాంధీ, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, -వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ల వెరిఫికేషన్‌పై అధికారులతో సమావేశం




**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం చేయూత పెన్షన్ల వెరిఫికేషన్ ప్రక్రియపై సంబంధిత వెరిఫికేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 4,500 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగింది. వీటి వెరిఫికేషన్ కోసం ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలకు చెందిన అధికారులను వెరిఫికేషన్ అధికారులుగా నియమించారు.వెరిఫికేషన్ అధికారులు తమకు కేటాయించిన డివిజన్లలో రేపటి నుంచి దరఖాస్తులను పరిశీలించి, అర్హతలను నిర్ధారించిన అనంతరం సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. చేయూత పెన్షన్ యాప్‌లో వెరిఫికేషన్ ప్రక్రియను ఏ విధంగా నిర్వహించాలి, వివరాలను ఎలా నమోదు చేసి అప్లోడ్ చేయాలనే అంశాలపై డిఆర్డిఓ అధికారులు, డిసి కేఎంసి శ్రీనివాస్ రావు అధికారులకు అవగాహన కల్పించారు. ఒంటరి మహిళలు, వృద్ధులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు పెన్షన్ దరఖాస్తులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 25వ తేదీలోపు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేసి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో ఏఈ నరేంద్ర తేజ, ఏఈ యాకూబ్ నాయక్, ఏఈ యాకూబ్ అలీ, ఏఈ ఫణికుమార్, సీనియర్ అకౌంటెంట్ సతీష్, సీనియర్ అసిస్టెంట్లు రవి, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రు, ఆర్ ఓ వెంకటలక్ష్మి , టిపిబిఓ దుర్గా సాయికిరణ్, టిపిబిఓ ప్రవీణ్ కుమార్, టిపిబిఓ శశి కుమార్ లను వెరిఫికేషన్ అధికారులుగా నియమించారు

# యుఎఫ్ బియు ఆధ్వర్యంలో

## 5 రోజుల పని దినాల కోసం దేశవ్యాప్త బ్యాంక్ సమ్మె

**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ ::** బ్యాంకింగ్ రంగంలో 5 రోజుల పని దినాలు అమలు చేయాలని కోరుతూ, యుఎఫ్ బియు ఆధ్వర్యంలో 8 లక్షల మంది బ్యాంక్ ఉద్యోగులు శుక్రవారం దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించారు. గత 11 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 5 రోజుల పని దినాలను వెంటనే అమలు చేయాలని, ఎంతో కాలంగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా, ప్రభుత్వం నుండి ఎటువంటి పరిష్కారం లేకపోవడంతో, పని ఒత్తిడితో ఉద్యోగులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. 2024లో జరిగిన 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో ఈ డిమాండ్‌ను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదు. అలాగే పిఎల్ ఐ అమలులో Scale-III వరకు ఒక విధానం, Scale-IV, పై స్థాయి ఉద్యోగులకు వివక్షాపూరిత విధానం అవలంబిస్తున్నందున, దీనిపై IBA తో పూర్తి స్థాయి చర్చ జరిపి, ఉద్యోగ సంఘాల అభిప్రాయం తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని DFS కు లేఖ పంపడం జరిగింది. నెల 9వ మరియు 10వ తేదీలలో Central Labour Commissioner ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో ఏకాభిప్రాయం కుదరలేదు.

ఈ సమ్మెలో ప్రధాన డిమాండ్లు
5 రోజుల పని దినాలను వెంటనే అమలు చేయాలి.
ప్రభుత్వ ప్రత్యేక, వివక్షాత్మక PLI స్కీమ్‌ను ఉపసంహరించాలి.




మిగిలిన అన్ని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి.

ఈ సమావేశంలో UFBU నాయకులు SK Ibrahim, T.Rajesh, K. Rambabu, Srikanth, R. Shiva Kumar,G Venkat rao తదితరులు పాల్గొన్నారు. ఈ సమ్మెకు సంఘీభావం తెలిపిన ట్రేడ్ యూనియన్ నాయకులు CITU – Kalyanam Venkateswarlu, AUTUC District President – Singi Narasimha Rao, AITUC మహిళా నాయకురాలు Seetha Mahalakshmi, BSNL Trade Union President – Tirumalachari, TUCI District Secretary Ch. Pullaiah. వీరందరూ ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

# ఖమ్మం జిల్లా బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం

**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంద సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలో జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ , జిల్లా ప్రధాన కార్యదర్శి గుప్త వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పమ్మి అనిత, సీనియర్ నాయకులు సుబ్బారావు లు హాజరై మహిళా మోర్చా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంద సరస్వతి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారత కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి మహిళా కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మహిళా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులు మన్నెం నాగమణి, గడ్డం భవాని, ఉపాధ్యక్షులు నీరుకొండ ఉషారాణి, మేడేపల్లి నీలిమ, వసంత,



గోలి ఫణికుమారి, కార్యదర్శులు సుందర స్వర్ణ, స్వాతి, సంగీత, కోశాధికారి మారుతి విశాలి, అధికార ప్రతినిధి సీత, సోషల్ మీడియా కన్వీనర్ మారుతి భార్గవి, మన్ కీ బాత్ కన్వీనర్ నాగమణి, కార్యవర్గ సభ్యులు ధనమ్మ, జయశ్రీ, సత్యవతి తదితర పదాధికారులు పాల్గొన్నారు.

# మహిళా మోర్చా జిల్లా కోశాధికారిగా మార్తి విశాలి

**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా మహిళా మోర్చా కోశాధికారిగా మార్తి విశాలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఖమ్మంలో జిల్లా బిజెపి మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షురాలు మంద సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, వరంగల్ జిల్లా ఇంచార్జ్ కొండపల్లి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గుప్తా వెంకటేశ్వరరావు,రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పమ్మి అనిత,సీనియర్ నాయకులు సుబ్బారావు హాజరై మహిళా మోర్చా కార్యకర్తలకు దేశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా మహిళా మోర్చా నూతన కార్యవర్గంలో విశాలిని జిల్లా కోశాధికారిగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, మహిళలను పెద్ద సంఖ్యలో బీజేపీ వైపు ఆకర్షించేందుకు కృషి చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని విశాలి తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు మార్తి విశాలిని అభినందించి, ఆమె ఆధ్వర్యంలో మహిళా మోర్చా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులు మన్నెం నాగమణి, గడ్డం భవాని, ఉపాధ్యక్షులు నీరుకొండ ఉషారాణి, మేడేపల్లి నీలిమ, వసంత, గోలి ఫణికుమారి, కార్యదర్శులు సుందర స్వర్ణ, స్వాతి, సంగీత,



కోశాధికారి మారుతి విశాలి, అధికార ప్రతినిధి సీత, సోషల్ మీడియా కన్వీనర్ మారుతి భార్గవి, మన్ కీ బాత్ కన్వీనర్ నాగమణి, కార్యవర్గ సభ్యులు ధనమ్మ, జయశ్రీ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఆర్ టి ఓ కార్యాలయంలో మారని తీరు

**- ఏసిబి దాడులు చేసిన అదే తీరు - నెలకు కోటి రూపాయల పైగే ఆదాయం**

**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఖమ్మం ఆర్ టి ఓ కార్యాలయంలో అడుగు అడుగున అవినీతికి అంతే లేకుండా పోతుంది. ఏసిబి అధికారులు దాడులు చేసిన ఆ అధికారులలో తీరు మారని పరిస్థితి నేలకొంది. ఖమ్మం ఆర్ టి ఓ కార్యాలయానికి నెలకు సుమారు కోటి రూపాయల పైగానే అక్రమంగా ఆదాయం లభిస్తుంది అనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఇదే శాఖలో పని చేస్తున్న సత్తుపల్లి నుండి బదిలీ పై వచ్చిన ఆ అధికారి ఆదాయం ఇటీవల పెద్ద మొత్తంలో పెరిగింది అనే ఆరోపణలు చోటు చేసుకున్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు కానీ, ఇప్పుడు పని చేస్తున్న అధికారుల ఆదాయం, వారి బంధువుల ఆదాయం పై క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తే అనేక విషయాలు బయటకు రావచ్చు. ఈ అవినీతి అక్రమాలపై వివరణ కోరగా నేను బిజీగా ఉన్నాను, నేను సమాధానం చెప్పలేని అని బదులు ఇచ్చారు. ఈ శాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది అంతా సిండికేట్ గా మారి అంతా పచ్చుకోవడం షరా మాములే అని చెప్పకు తప్పదు. ఇప్పటికైనా సంబందించిన శాఖ ఉన్నాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి. ఇంకా ఇదే శాఖలో ఏవరి వద్ద ఎంత మొత్తంలో డబ్బులు తీసుకున్న వివరాలను సైతం బట్టబయలు చేయనున్నాం.






# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి

- అక్రమ ఇసుక, పశు రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి
- పెట్రోలింగ్, బ్లూ కోట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి
- అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** వార్షిక తనిఖీలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వివిధ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రేవ్, ప్రాపర్టీ, దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిందితులను త్వరగా గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా అక్రమ పశు రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో భాగంగా గత నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు, బ్లూ కోట్స్ వాహనాల్లో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే స్పందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించిన అనంతరం పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు సీఐఆర్ పోర్టల్, ఈ సాక్ష, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా నేరాల దర్యాప్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీలక్ష్మి , స్టేషన్ హౌస్ ఆఫీసర్ విజయసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.






# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకారించాలి

**-శాంతి కమిటీల సమన్వయ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ ::** వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతి సామరస్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పీస్ కమిటీలతో వినాయక నవరాత్రి విగ్రహాల ఏర్పాట్లు, బందోబస్తుపై పోలీసు కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అదేవిదంగా సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలకు అవగాహన కల్పించడం. అనుమానాస్పద సమాచారం లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.గణేష్ నవరాత్రుల ఉత్సవాలు శాంతియుతంగా, సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా భద్రతకు సంబంధించి, పోలీసు, నగరపాలక సంస్థ , అగ్ని మాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తూ, శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు.గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, బాలకృష్ణ భానుప్రకాష్ పాల్గొన్నారు.

# కొత్త క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**- పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది కొత్త క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు.కొత్త క్రిమినల్ చట్టాలు–2023 అమలులోకి వచ్చిన నేపథ్యంలో 500 మంది సిటీ అర్మ్డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు గత వారం రోజులుగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని (సిటీసి) సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్వహించారు. ఈ శిక్షణలో భారతీయ న్యాయ సంహిత–2023 (బిఎన్ ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత–2023 (బిఎన్ ఎస్ ఎస్), భారతీయ సాక్ష్య అధినియమం–2023 (బిఎస్ఏ) లోని ముఖ్యమైన నిబంధనలు, కొత్త చట్టాల ప్రకారం కేసుల నమోదు, దర్యాప్తు విధానం, సాక్ష్యాల సేకరణ, డిజిటల్ మరియు ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ప్రాధాన్యత, బాధితుల హక్కులు, అరెస్టు–రిమాండ్ ప్రక్రియ, కోర్టు విచారణ తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. కొత్త చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తును మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై అధికారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వండం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా కొత్త చట్టాల అమలులో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.కార్యక్రమంలో సిటీసి ఏసీపీ హరినాద్ బాబు, ఆర్ ఐ నాగుల్ మీరా పాల్గొన్నారు.

# నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి రెండవ గొప్ప ధార్మిక బహిరంగ సభను జయప్రదం చేయండి

- ముఖ్య అతిథులుగా హాజరు కానున్న మౌలానా ముఫ్తీ సల్మాన్ సాహెబ్ బిజునూరి, (ప్రొఫెసర్ హదీస్ దారుల్ ఉలూమ్ దేవబన్ ఉత్తరప్రదేశ్ ), డాక్టర్ హాఫీజుర్ రహమాన్ సాహెబ్,( కన్వీనర్ ఖుసురో ఫౌండేషన్ ఢిల్లీ) స్వామి లక్ష్మిశంకరాచార్య (ఫౌండర్ హిందూ ముస్లిం జన్ ఏక్తా మన్చ్ కాన్పూర్ ఉత్తరప్రదేశ్ )



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** ఈనెల 12వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోనీ శనివారం, మగ్రిబ్ నమాజ్ అనంతరం కొత్తగూడెం క్లబ్, కొత్తగూడెంలో సమస్త మానవాళికి ప్రవక్త ముహమ్మద్ (స.అ.స) సందేశంజిల్లా స్థాయి రెండవ గొప్ప ధార్మిక బహిరంగ సభను జయప్రదం చేయాలని ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ప్రెసిడెంట్ మౌలానా షేక్ ముజాహిద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ పిలుపునిచ్చారు.మీడియా సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ ధార్మిక సభకు ముఖ్య అతిథులుగా మౌలానా ముఫ్తీ సల్మాన్ సాహెబ్ బిజునూరి, (ప్రొఫెసర్ హదీస్ దారుల్ ఉలూమ్ దేవబన్ ఉత్తరప్రదేశ్ ), డాక్టర్ హాఫీజుర్ రహమాన్ సాహెబ్,( కన్వీనర్ ఖుసురో ఫౌండేషన్ ఢిల్లీ) స్వామి లక్ష్మి శంకరాచార్య (ఫౌండర్ హిందూ ముస్లిం జన్ ఏక్తా మన్చ్ కాన్పూర్ ఉత్తరప్రదేశ్ ) హాజరు కానున్నారని వారు తెలిపారు.ఈ ధార్మిక సభకు మత పెద్దలు, ముస్లిం మైనారిటీలు, ప్రొఫెసర్లు భారీగా తరలివచ్చి ఆధ్యాత్మిక సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

# బీసీల ధర్మ పోరాట దీక్షల సందర్భంగా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందించిన

**-జాతీయ బి.సి సంక్షేమ సంఘం నాయకులు**



**ఖమ్మం, సెప్టెంబర్ 11, నేటి శుభోదయ :** దేశ వ్యాప్తంగా జరిగే జాతి జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 1–5– 2025 న నిర్ణయం తీసుకొని ప్రకటించింది.కానీ ఇప్పుడు కులగణన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా, ఓబీసీ కుటుంబాలను లెక్కించకుండా, బీసీ కాలం లేకుండా, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ లేకుండా బిసీలకు అన్యాయం చేస్తుంది, రెండవసారి అప్పుడే జాతీయ జన గణన ఆగస్టు 17వ తేదీ నుండి ప్రారంభం మొదలుపెట్టిందిబీసీలను మోసం చేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, నయవంచను వ్యతిరేకిస్తూ ఈనెల 11 వ తేదీన (శుక్రవారం) రోజున తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, కేంద్రాల్లోబీసీల ధర్మ పోరాట దీక్షలు చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో అదనపు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేవీ కృష్ణారావు, జిల్లా అధ్యక్షులు బత్తిని మధు గౌడ్, గౌరవ అధ్యక్షులు బచ్చల పద్మాచారి, రాష్ట్ర కార్యదర్శి మోత్కూరి వెంకటేశ్వర చారి జిల్లా ఉపాధ్యక్షులు పార్థసారథి పుల్లూరు వెంకన్న బాబు,నాగరాజు యాదవ్ గుడిగంటి వీరన్న రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620